
తేలియాడుతూ తినేద్దాం..

27న గోదావరిపై ఫ్లోటింగ్ రెస్టారెంట్ ప్రారంభం



రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆహ్లాదకర వాతావరణంలో గోదారి అందాల నడుమ రుచుల విందు ఆస్వాదించేలా ఫ్లోటింగ్ రెస్టారెంట్ సిద్ధమవుతోంది. పర్యాటకశాఖ సౌజన్యంతో ప్రైవేటు వ్యక్తుల నిర్వహణలో గోదావరిపై తొలిసారిగా పూర్తిస్థాయిలో ఇది అందుబాటులోకి రానుంది. రాజమహేంద్రవరంలోని ఉమా మార్కండేయస్వామి ఆలయం సమీపంలోని లాంచీల రేవు నుంచి ఏపీ టూరిజం బోట్ల ద్వారా ప్రయాణించి ఫ్లోటింగ్ రెస్టారెంట్‌కు చేరుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 27న ఆదివారం ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ దీనిని ప్రారంభిస్తారని, ఎంపీ పురందేశ్వరి తదితరులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కిట్టీ పార్టీలు, పుట్టినరోజు వేడుకలు నిర్వహించుకునేందుకు సైతం అనువుగా ఈ రెస్టారెంట్ ఉంటుందన్నారు.

నారసింహం.. నయన మనోహరం



అలరించిన మోహినియాట్టం నృత్యం



వట్టివేళ్ల కిరీటాలతో ఉత్సవ మూర్తుల దర్శనం

వాడపల్లి(ఆత్రేయపురం): వాడపల్లి శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సింహవాహనంపై స్వామి వైభవంగా ఊరేగారు. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి యోగనరసింహ అలంకరణలో తిరువీధుల్లో విహరించడంతో భక్తులు జయజయ ధ్వానాలు చేశారు. సింహం పరాక్రమానికి, ధైర్యానికి, తేజస్సుకు, ఆధిపత్యానికి, మహాధ్వనికి సంకేతం. అజ్ఞానంతో ప్రవర్తించే దుష్టులను హరించడంలో తాను సింహ సమానంతో ప్రయత్నిస్తానన్న శ్రీవారి సందేశాన్ని ఈ సందర్భంగా పండితులు వినిపించారు. మహాస్నపన, ప్రధాన హోమాలు, తిరుప్పావడ సేవ, మహాశాంతి హోమం తదితర కార్యక్రమాలను పండితుడు రాజేశ్వర వరప్రసాదాచార్యులు నేతృత్వంలో అర్చకస్వాములు జరిపించారు. స్వామివారికి డీసీ ఎన్ఎస్ చక్రధరరావు, కనక దుర్గాదేవి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు.

శుక్రవారం మహాలక్ష్మీహోమం, మలయప్ప అలంకరణలో గరుడ వాహన సేవ ఉంటాయి.



సింహవాహన సేవ

యంత్రాలతో తంత్రం

కాటన్ ఆనకట్ట వద్ద యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు



నీటి మళ్లింపునకు నదిలో తవ్విన కాలువలు

ఈనాడు, రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే, ఆత్రేయపురం: జాతీయ హరిత ట్రైబ్యునల్ ఆదేశాల మేరకు నదిలో యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేయకూడదు.. రివర్ కన్జర్వేటర్ చట్ట ప్రకారం నదిలో కట్టడానికి 500 మీటర్లకు దూరంలో తవ్వకాలు నిషేధం.. ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడంలేదు. ధవళేశ్వరం కాటన్ ఆనకట్టకు ఆనుకుని ఆత్రేయపురం మండలం బొబ్బర్లంకలో గురువారం వేకువజాము నుంచి ఉదయం 8.30 గంటల వరకు జేసీబీతో ఇసుక తవ్వకాలు చేపట్టారు. పైగా నీటి మళ్లింపు పనులు చేపట్టారు. కొందరు వ్యక్తులు నదిలో టెంట్ వేసుకుని ఈ తవ్వకాలను పర్యవేక్షించారు. ఇసుక తవ్వి తరలించేందుకు వీలుగానే నీటి మళ్లింపు ప్రక్రియ చేపట్టినట్లు తెలుస్తోంది. బ్యారేజీ స్కవర్ స్లూయిజ్ తదితర చోట్ల రేయింబవళ్లు తవ్వకాలు సాగుతున్నాయి. రోజుకు 30 లారీల వరకు ఇసుక సరిహద్దులు దాటిపోతోంది.



కాటన్ బ్యారేజీకి అతి సమీపంలో జేసీబీతో తవ్వకాలు

రాత్రి 10 తర్వాత ప్రారంభించి..

రాజవరం, వెలిచేరు తదితర చోట్ల లంక మట్టి తవ్వకాలు రాత్రి 10 గంటల తర్వాత ప్రారంభించి వేకువ జామున 4 వరకు కొనసాగిస్తున్నారు. భారీ వాహనాలు ఆనకట్టపైకి వెళ్లకూడదన్న నిబంధన ఉన్నా పట్టడం లేదు. గస్తీ బృందం, లస్కర్లు ఉన్నా అడ్డగోలు తవ్వకాలను నియంత్రించలేదు. బ్యారేజీ వద్ద జేసీబీతో నీటి మళ్లింపు పనులు చేయడంపై హెడ్ వర్క్స్ ఈఈ కాశీవిశ్వేశ్వరరావు వద్ద ప్రస్తావించగా తమ దృష్టికి విషయం వచ్చిందని, టాస్క్‌ఫోర్స్ అధికారులు అడ్డుకున్నట్లు కింది స్థాయి సిబ్బంది తెలిపారన్నారు. కేసు నమోదు చేయాలని ఆదేశించామన్నారు.

విమానాశ్రయం ఇక్కడా? అక్కడా?



ఈనాడు, కాకినాడ -న్యూస్‌టుడే, తొండంగి, తుని పట్టణం

- తొండంగి మండలంలో 519 ఎకరాల భూమి లభ్యతపై ప్రతిపాదన
- కాకినాడ-అమలాపురం మధ్యలో ఏర్పాటు మేలన్న వాదన..
- రెండు జిల్లాలను ఊరిస్తున్న ప్రాజెక్టు

కాకినాడ, కోనసీమ జిల్లాల్లో ఎక్కడా విమానాశ్రయం లేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యాంశం కింద తీసుకుంది. అయితే ఎక్కడ ఏర్పాటనే అంశంపై తర్జనభర్జన సాగుతోంది. ఇప్పటికే తుని-అన్నవరం మధ్యలో భూముల లభ్యతపై ప్రతిపాదనలు వెళ్లడంతో ఇక్కడే ఖరారవ్వచ్చునే చర్చ ఉంది. దీనిని యంత్రాంగం ఇంకా ధ్రువీకరించలేదు. ప్రజల రాకపోకల సౌలభ్యం, భూములు.. పారిశ్రామిక- వ్యాపార- వాణిజ్య- పర్యాటక ప్రాంతాలు బేరీజు వేసుకుని నిర్ణయం తీసుకోనున్నారు.

ఎక్కడెక్కడ సౌలభ్యమంటే..

- కాకినాడ- అమలాపురం మధ్యలో విమానాశ్రయం వస్తే రాజమహేంద్రవరం వెళ్లాల్సిన అవసరం ఉండదు.
- అమలాపురం నుంచి తునిలోని విమానాశ్రయానికి వెళ్లాలంటే 123 కి.మీ.. కాకినాడ నుంచైతే 60 కి.మీ ఉంది.
- తాళ్లరేవు, కరప అనువైన ప్రాంతాలని, రెండు జిల్లాలవారికీ దూరాభారం ఉండదనే వాదన ఉంది.

ప్రణాళికలతో సరి..

ఉమ్మడి జిల్లాలో నగరాలు, పట్టణాలను రానున్న 30 ఏళ్లలో ఎలా అభివృద్ధి చేయాలన్న ప్రణాళికతో గతంలో గోదావరి నగరాభివృద్ధి సంస్థ 'దృక్పథ ప్రణాళిక' గుడా విజన్-2050లో భాగంగా ప్రతిపాదనలు రూపొందించింది. కాకినాడలో విమానాశ్రయం, మెట్రో రైలు ప్రాజెక్టు ఏర్పాటు ఆవశ్యకతను ప్రస్తావించింది. వైకాపా ప్రభుత్వం వచ్చాక ఒక జిల్లా-ఒక విమానాశ్రయం నినాదంతో హడావుడే తప్ప ప్రయత్నాలు సాగలేదు.

కసరత్తు షురూ..

ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సూచనలతో 3సీ, 4సీ, 4ఈ టైప్ ఎయిర్ క్రాఫ్టులు నిలిపేందుకు వీలుగా.. ఎయిర్ సైడ్, సిటీ సైడ్, రన్‌వే స్ట్రిప్‌ను భవిష్యత్తులో విస్తరించేందుకు ఎంత భూమి అవసరమో నిర్దేశించారు. తుని నియోజకవర్గం తొండంగి మండలం బెండపూడి, చిన్నయ్యపాలెం పరిధిలో విమానాశ్రయానికి 519 ఎకరాలు అందుబాటులో ఉన్నట్లు గుర్తించారు. 1,222 మంది రైతుల నుంచి సేకరించాలి. అన్నవరం దేవస్థానం, సెజ్ పరిధిలోని భూమి కావడంతో ఎకరం రూ.70 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంది. భూసేకరణకే రూ.500 కోట్లు అవసరం.

రెండింటీ ప్రాధాన్యాన్ని గుర్తించి..

కూటమి ప్రభుత్వం వచ్చాక.. తొలి ప్రాధాన్యంగా కాకినాడ- అమలాపురం మధ్య విమానాశ్రయం నిర్మించాలన్న ప్రతిపాదన వచ్చింది. కాకినాడలో ఇప్పటికే రెండు పోర్టులు ఉన్నాయి. పారిశ్రామికంగా కాకినాడ.. కొబ్బరి, ఇతర ఆహార ఉత్పత్తుల కేంద్రంగా కోనసీమ ఉండటంతో ఈ జిల్లాలకు మధ్యలో విమానాశ్రయం మేలన్న వాదన ఉంది. ఉప్పు భూములు, పోర్టు భూములు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు తొలగిస్తే ప్రాజెక్టు సాకారమయ్యే అవకాశం ఉంది.



తొండంగి: బెండపూడి-చిన్నయ్యపాలెం మధ్య గుర్తించిన భూములు

బెండపూడి-చిన్నయ్యపాలెంలో విమానాశ్రయం వస్తే దూరం (కి.మీ.లలో)

తుని పట్టణానికి.. 20	రాజమహేంద్రవరం.. 80	
కాకినాడ.. 60	కాకినాడ సెజ్‌కు.. 20	విశాఖకు 112

డీపీటీ టీకాలు లేవండి!

రాజమహేంద్రవరం వైద్యం: చిన్నారులకు ఏడాదిన్నర వయసులో ఒకసారి, అయిదేళ్లకు మరోసారి వేయాల్సిన డిఫ్తీరియా పెర్టుసిస్ టెటానస్(డీపీటీ) టీకాకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొరత ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం నుంచి సరఫరా లేకపోవడమే కారణమని అధికారులు చెబుతున్నారు. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పీపీ యూనిట్లలో జరిగే టీకా కార్యక్రమంపై తీవ్ర ప్రభావం పడుతోంది. చిన్నారి వయసు 16-24 నెలల మధ్య డీపీటీ మొదటి బూస్టర్, 5-6 ఏళ్ల మధ్య రెండో బూస్టర్ టీకా వేస్తారు. తూర్పు, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో నెలకు 30 వేల డీపీటీ డోసులు అవసరమవుతాయి. చాలాచోట్ల రెండు నెలలకు పైగా కొరత ఉంది. దీంతో చిన్నారులతో వచ్చే తల్లులను వెనక్కి పంపేస్తున్నారు. నెల క్రితం వరకు పాతవాటినే సరిపెట్టారు. టీకాల వినియోగంపై 'ఇ-విన్' పోర్టల్‌లో సక్రమంగా నమోదుచేయకపోవడం సమస్యగా మారింది. మరో రెండు, మూడు రోజుల్లో వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ

క్రీడా స్ఫూర్తితోనే ఓటమిని భరించే శక్తి

దానవాయి పేట(రాజమహేంద్రవరం): ఓటమి, కష్టాన్ని భరించే శక్తి క్రీడలు ఇస్తాయని ఎస్పీ డి.నరసింహ కిషోర్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జిల్లా పోలీసుల వార్షిక స్పోర్ట్స్ మీట్-2024ను గురువారం ఆయన ప్రారంభించారు. జిల్లాస్థాయి విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్, ఈస్ట్, నార్త్, సౌత్, ట్రాఫిక్, ఏఆర్ జోన్లతోపాటు కొవ్వూరు సబ్ డివిజన్‌కు సంబంధించిన క్రీడా జట్లు కవాతు నిర్వహించి ఎస్పీకి గౌరవ వందనం సమర్పించాయి. మూడు రోజులపాటు కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్, 100, 400, 800 మీటర్ల పరుగు, హైజంప్, లాంగ్ జంప్, క్రికెట్, టెన్నిస్, షటిల్, అథ్లెటిక్స్ క్రీడా పోటీలు పోలీసు పెరేడ్ గ్రౌండ్, జాంపేట ఏఆర్ గ్రౌండ్స్, ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నారు.



వంద మీటర్ల పరుగులో క్రీడాకారిణులు

అథ్లెటిక్స్.. ఆట అదుర్స్

శ్యామలా సెంటర్ (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక గురువారం రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభమైంది. జిల్లా స్కూల్ గేమ్స్ సంఘం ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరగనున్న ఈ పోటీలకు తొలిరోజు అండర్-14 విభాగంలో ఎంపికలు జరిగాయి. పరుగు, హర్డిల్స్, హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావలిన్‌త్రో తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించి క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి తెలిపారు. ఎంపికైన జట్టు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. తూర్పు గోదావరి డీఎస్ఈఓ కె.వాసుదేవరావు, డీవైఈఓ నారాయణ, డీఐ బి.దిలీప్‌కుమార్‌లు ఈ పోటీలు ప్రారంభించారు.



ఎంఓయూ పత్రాలను మార్చుకుంటున్న ఇరు సంస్థల ప్రతినిధులు

నన్నయ-కాప్స్ అవగాహన ఒప్పందం

నన్నయ విశ్వవిద్యాలయం(రాజానగరం): నన్నయ విశ్వవిద్యాలయం, సెంటర్ ఫర్ ఆంధ్రప్రదేశ్ స్టడీస్ (కాప్స్) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. విశ్వవిద్యాలయంలో వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, కాప్స్ కార్యదర్శి ఓలేటి సత్యనారాయణ ఎంఓయూ పత్రాలపై గురువారం సంతకాలు చేసి పత్రాలు మార్చుకున్నారు. వీసీ ఆచార్య శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యా సంబంధ కార్యక్రమాలు, పరిశోధన, ప్రచురణ సహకారాలకు సంబంధించిన అంశాలతో ఈ అవగాహన ఒప్పందం కుదిరిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఔన్నత్యాన్ని, తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషలలో ప్రచురించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లేందుకు ఉపయోగపడుతుందన్నారు. సీడీసీ డీన్ ఆచార్య కె.శ్రీరమేష్, వర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య డి.జ్యోతిర్మయి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డా.వి.పెర్సిస్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ డీన్ ఆచార్య కె.రమణేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యత పనులకు ఇసుక

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): సీజ్ చేసిన, స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుకను ప్రభుత్వ ప్రాధాన్యత పనులకు ఆఫ్‌లైన్ విధానంలో కేటాయించాలని కలెక్టర్ ప్రశాంతి సంబంధిత అధికారులను గురువారం ఆదేశించారు. దీంతోపాటు బోట్స్‌మెన్ సొసైటీలకు లక్ష్యాలను నిర్దేశించి, వినియోగదారులందరికీ ఇసుక అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. చిన్న రీచ్‌లలో వెయ్యి మెట్రిక్ టన్నులు, పెద్ద రీచ్‌లలో 2,500 నుంచి 3 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉండేలా తవ్వకాలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. తవ్వకాలకు తొలి విడత 44, రెండో విడత 74 సొసైటీలకు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. జిల్లాలో గుర్తించిన 17 ఓపెన్ రీచ్‌ల్లో నీటి నిల్వలు ఉండటం వల్ల ఇంకా కార్యకలాపాలు ప్రారంభించలేదని అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

ధాన్యం సేకరణలో ఆటంకాలు వద్దు: జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం సేకరణ కోసం బ్యాంకు గ్యారంటీ ఇవ్వని మిల్లర్లను బ్లాక్‌లిస్టులో పెడతామనే విషయాన్ని వారికి తెలియజేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

కౌలు రైతులకు ఉపకారిగా నూతన చట్టం

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: భూయాజమాని హక్కులకు ఎటువంటి భంగం కలగకుండా కౌలు రైతులకు నూరుశాతం ప్రభుత్వ పథకాల ప్రయోజనం చేకూర్చడమే నూతన కౌలు చట్టం లక్ష్యమని కలెక్టర్ ప్రశాంతి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ నూతన సాగుదారుల హక్కు చట్టం-2024 అమలుపై సూచనలు, సలహాలు స్వీకరించేందుకు గురువారం రాజమహేంద్రవరం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కౌలు రైతులు, భూ యాజమానులు, బ్యాంకర్లతో సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గతంలో కౌలుదారు చట్టాల్లోని లోపాలను అధిగమించి కొత్త చట్టం ద్వారా నూరుశాతం ప్రయోజనం రైతుకు చేకూర్చేలా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పంట సాగుచేసే రైతులు ప్రభుత్వ ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొందేందుకు, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, నష్టపరిహారం, నగదు బదిలీ, ఇతర పథకాల ప్రయోజనాలు అందించడం ధ్యేయంగా నూతన చట్టంలో వీలు కల్పించడం జరుగుతుందన్నారు. గతంలో కౌలుదారుడికి తహసీల్దారు, రెవెన్యూ విభాగం ద్వారా గుర్తింపు కార్డులు ఇచ్చేవారమని, నూతన చట్టంలో వ్యవసాయ అధికారి ఇస్తారని తెలిపారు. షార్ట్ టర్మ్ లోన్ సమయంలో సేద్యపు భూమి ఎవరి ఆధీనంలో ఉంటుందో వారే రుణానికి అర్హులన్నారు. దీర్ఘకాలిక రుణాలు భూ యాజమాని సర్వే నంబరు ప్రకారం పొందవచ్చన్నారు. వ్యవసాయ శాఖ అదనపు సంచాలకుడు వి.శ్రీధర్, జేసీ చిన్నరాముడు, వ్యవసాయ అధికారి మాధవరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ఐ.. సేవలు ఆగాయ్..

జీజీహెచ్‌లో మరమ్మతులకు గురైన యంత్రం

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం వైద్యం

రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(జీజీహెచ్)లో ఎంఆర్ఐ స్కానింగ్ సేవలు వారం రోజులుగా అందడం లేదు. యంత్రం మరమ్మతులకు గురవడంతో రోగులకు ఇబ్బంది తప్పడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చేవారు చేసేదిలేక ప్రైవేటు పరీక్ష కేంద్రాలను ఆశ్రయించి రూ.5 వేలు నుంచి రూ.8 వేలు వెచ్చించి ఎంఆర్ఐ చేయించుకోవాల్సిన పరిస్థితి.

ఎంఆర్ఐ స్కానింగ్.. రోగులకు అత్యవసర చికిత్స అందించేందుకు ఇది ఎంతో కీలకం. రోడ్డు ప్రమాదాల్లో తల, నరాల వ్యవస్థ, వెన్ను, ఉదర, ఇతర అవయవాల్లో తీవ్ర సమస్యలను గుర్తించేందుకు ఈ స్కానింగ్ పరీక్ష ద్వారా నిర్ధారిస్తారు. జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన యంత్రంలో ప్రెజర్ తగ్గకపోవడంతో మూలకు చేరింది.



జీజీహెచ్‌లో మూతపడిన ఎంఆర్ఐ స్కానింగ్ గది

రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో నాలుగేళ్ల కిందట ఎస్ఆర్ఐ సంస్థ ద్వారా పీపీపీ విధానంలో ఇక్కడ ఎంఆర్ఐ స్కానింగ్‌ను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ విధానంలో రేడియాలజిస్టు రిపోర్టులు తయారు చేసి ఇక్కడి రోగులకు ఇస్తారు.

రేడియాలజిస్టు నియామకమూ లేదు..

రాజమహేంద్రవరంలో ఆసుపత్రిలో రేడియాలజిస్టు లేరు. రోజు విడిచి రోజు కాకినాడ జీజీహెచ్ నుంచి వచ్చి ఇక్కడ రిపోర్టులు ఇచ్చేవారు. ప్రస్తుతం ఎంఆర్ఐ మూలకు చేరడంతో సేవలు పూర్తిగా ఆగిపోయాయి.

ఇదీ తీవ్రత

జీజీహెచ్‌లోని సర్జరీ, మెడిసిన్, న్యూరో, మానసిన విభాగాల్లో సుమారు 30 కేసులకు సంబంధించి ఎంఆర్ఐ సేవల కోసం వేచి ఉన్నారు. ఉన్నతాధికారులు స్పందించి త్వరితగతిన సేవలు పునరుద్ధరించేలా చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

డీఆర్ఓగా సీతారామమూర్తి

రాజమహేంద్రవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్ఓ)గా టి.సీతారామమూర్తిని నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖపట్నంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎల్ఏ)గా విధులు నిర్వర్తిస్తున్న ఈయన బదిలీపై రానున్నారు. ఇప్పటి వరకు డీఆర్ఓగా విధులు నిర్వర్తించిన జి.నరసింహులు తిరుపతికి బదిలీ అయ్యారు.

విద్యారంగ సమస్యలపై 6న 'చలో కలెక్టరేట్'

శ్యామలా సెంటర్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: విద్యారంగంలో సమస్యల పరిష్కారానికి నవంబరు 6న 'చలో కలెక్టరేట్' కార్యక్రమానికి పిలుపు ఇస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా తెలిపారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద గురువారం గోడప్రతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 28, 29, 30 తేదీల్లో మండల కేంద్రాల్లో ధర్నా చేపట్టనున్నామన్నారు. కూటమి ప్రభుత్వం విద్యా, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.కనక, సహాయక కార్యదర్శి కె.జ్యోతిర్మయి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

డెల్టాకు నీటి విడుదల

ధవళేశ్వరం(హుకుంపేట), న్యూస్‌టుడే: ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి గురువారం 9,200 క్యూసెక్కుల సాగు నీటిని విడుదల చేశామని జలవనరులశాఖ అధికారులు తెలిపారు. తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలకు 2700, 1500, 5000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం కాటన్ బ్యారేజీ వద్ద 10.90 అడుగుల నీటిమట్టం కొనసాగుతుందన్నారు. 39,342 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు.

కందుకూరి చరితం.. భావితరాలకు పదిలం

వీరేశలింగం జన్మ గృహంలో ఆయన రచనలు

కందుకూరి రచించిన, ఆయనకు సంబంధించిన 60కి పైగా పుస్తకాలు



న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

చరిత్ర ఎన్నిసార్లు మననం చేసుకున్నా తెలుసుకోవలసింది ఇంకా మిగిలే ఉంటుంది. కందుకూరి వీరేశలింగం.. నాటి సాంఘిక దురాచారాలపై ఉక్కుపాదం మోపి మహిళల జీవితాల్లో వెలుగు నింపారు. సంఘ సంస్కరణల్లో భాగంగా పలు రచనలూ చేశారు. రాజమహేంద్రవరానికి చెందిన ఎస్‌కేవీటీ కళాశాల తెలుగు శాఖాధిపతి పి.వి.బి.సంజీవరావు కందుకూరి జీవితంపై పరిశోధన చేశారు. అప్పట్లో ఆయన సేకరించిన అరుదైన పుస్తకాలను ఇటీవల రాజమహేంద్రవరంలోని కందుకూరి జన్మగృహం (వంకాయలవారి వీధి)లో అందజేశారు. భావి పరిశోధకులకు అనువుగా వీటిని జన్మగృహంలోని గ్రంథాలయంలో భద్రపరిచారు.

కందుకూరి కేవలం సంఘ సంస్కర్త మాత్రమే కాదు. సమాజ హితం కోసం కలం పట్టిన రచయిత. తొలి నవలా రచయిత కూడా. వాస్తవ పరిస్థితులను ఆధారంగా చేసుకుని ఆయన రాసిన తొలి తెలుగు నవల 'రాజశేఖర చరిత్రము' నేటికీ ప్రత్యేకమే. తొలి తెలుగు విషాదాంత నాటకం ప్రహ్లాద నాటకం. సమాజంలోని నాటి పరిస్థితులను తూర్పారబెడుతూ కందుకూరి రాసిన అనేక రచనలు పుస్తకాల రూపంలో ఉన్నాయి. బాలలకు సంబంధించిన కథా సాహిత్యం, స్త్రీలకు సంబంధించిన పలు పుస్తకాలు రచించారు.




వంకాయలవారి వీధిలో పుట్టిన ఇల్లు

ఇంట్లో ఇప్పటికీ...

వీరేశలింగం 1881 డిసెంబరు 11న తొలి వితంతు పునర్వివాహం జరిపించిన నాటి ఘట్టాన్ని విగ్రహ రూపంలో కందుకూరి గృహంలో ఏర్పాటు చేశారు. సమాజ చైతన్యం కోసం ఆయన నడిపిన వివేకవర్ధిని పత్రిక, రాసిన నాటకాలు ముద్రించేందుకు వినియోగించిన యంత్రం ఇప్పటికీ భద్రమే. కందుకూరి వినియోగించిన దుస్తులు, రాతప్రతులు, ఆయన కూర్చున్న చెక్క కుర్చీ వంటివి ఇక్కడ చూడవచ్చు. కందుకూరి జీవితంలో ముఖ్యమైన అంశాలను పట్టికల రూపంలో నిక్షిప్తం చేశారు. తన భార్య రాజ్యలక్ష్మి కోసం నిర్మించిన భవనం, ఆవరణలో నుయ్యి, పనస చెట్టు వంటి నాటి గుర్తులు నేటికీ పదిలమే.


వినియోగించిన ముద్రణ యంత్రం


పొందుపరిచిన చరిత్ర వివరాలు

పరిశోధన కోసం అయిదేళ్లు తిరిగా..



నేను పుట్టింది ఇన్నీస్‌పేటలో కావడంతో అదే ప్రాంతంలో కందుకూరి స్వయంగా నిర్మించిన వీటీ విద్యాసంస్థలున్నాయి. చిన్నతనం నుంచి అదే ఆవరణలో ఆడుకోవడం, నాన్న ద్వారా కందుకూరి సంస్కరణలు వినడంతో ఆయన చరిత్రపై ఆసక్తి పెరిగింది. పూర్తిస్థాయిలో వీరేశలింగం జీవితం గురించి తెలుసుకోవాలనే తపనతో 1994 మొదలుకుని 1999 వరకు పరిశోధన చేశా. భీమవరం సమీపంలోని కుముదవల్లి గ్రామంలో కందుకూరి స్వయంగా స్థాపించిన గ్రంథాలయంలో ఆయనకు సంబంధించి అనేక వివరాలు తెలిశాయి. ముఖ్యంగా కందుకూరి మద్రాస్‌లోని వేద విలాస్ భవనంలో ఎక్కువగా ఉండేవారు. పరిశోధన సమయంలో నేను సేకరించిన వివరాలతో రూపొందించిన పుస్తకాలు, కొన్ని ఆయన రచించిన పుస్తకాలు కలిపి మొత్తం 60 ఇటీవల పురావస్తు శాఖకు అందజేశా. భావితరాలకు ఆయన చరిత్ర పదిలంగా ఉండాలనేది నా కోరిక.

- పి.వి.బి.సంజీవరావు, కందుకూరి చరిత్ర పరిశోధకుడు, రాజమహేంద్రవరం

పరిశోధకులకు ఉపయుక్తం..



కందుకూరి జన్మగృహంలో వీరేశలింగం రచించిన కొన్ని ముద్రిత పుస్తకాలు భద్రపరిచాం. పరిశోధకులు ఎవరైనా వీటిని అధ్యయనం చేయవచ్చు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వంకాయలవారి వీధిలోని కందుకూరి జన్మగృహం సందర్శించవచ్చు.

- కె.తిమ్మరాజు, సహాయ సంచాలకుడు, పురావస్తుశాఖ

ఈఎస్‌ఐ వైద్య సేవల తీరుపై ఆందోళన


వైద్య సిబ్బందిని ప్రశ్నిస్తున్న సీపీఐ, జట్ల కార్మిక సంఘం నాయకులు

వి.ఎల్.పురం (రాజమహేంద్రవరం): ప్రభుత్వ కార్మిక బీమా ఆసుపత్రి(ఈఎస్‌ఐ) వైద్యసేవల తీరుపై సీపీఐ, జట్ల లేబర్ యూనియన్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం ఈఎస్‌ఐ ఆసుపత్రిని గురువారం సందర్శించి.. నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆసుపత్రి, ప్రత్యామ్నాయ భవనాల్లో కొనసాగుతున్న ఓపీ, ల్యాబ్, ఇతర బ్లాక్‌లను పరిశీలించారు. వైద్యసేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మధు, జట్ల లేబర్ యూనియన్ అధ్యక్షుడు కె.రాంబాబు మాట్లాడుతూ.. 50 పడకల నుంచి వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయినా వైద్య సిబ్బంది పెరగలేదన్నారు. 200 మంది సిబ్బంది ఉండాల్సిన ఆసుపత్రిలో కేవలం 26 మందే ఉన్నారన్నారు. మహిళా ఉద్యోగులకు రక్షణ లేకుండా పోయిందని, కనీసం సెక్యూరిటీ సిబ్బంది లేరని ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌తో పాటు కొందరు వైద్యులు అందుబాటులో ఉండటం లేదని, ప్రైవేటు ప్రాక్టీసు చేసుకుంటూ ఇక్కడ అప్పుడప్పుడు విధులు నిర్వర్తిస్తున్నారని ఆరోపించారు. మూడేళ్లుగా ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు జరగడం లేదన్నారు. అత్యవసర కేసులను రిఫరల్ ఆసుపత్రులకు పంపించేస్తున్నారన్నారు.

అస్సాగో పరిశ్రమ సమస్య పరిష్కారానికి ప్రత్యేక కమిటీ

రాజమహేంద్రవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: అస్సాగో ఇథనాయిల్ ఇండస్ట్రీస్ ద్వారా ఉత్పన్నమైన సమస్య పరిష్కారానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. పరిశ్రమలు, పర్యావరణ శాఖల అధికారులతో గురువారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కమిటీలో రెవెన్యూ, పరిశ్రమలు, పర్యావరణ తదితర శాఖల అధికారులను నియమించామన్నారు. పరిశ్రమ కాలుష్య ప్రభావం, గ్రామస్థుల అభ్యంతరాలు, పరిశ్రమ ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై కమిటీ సభ్యులు అధ్యయనం చేస్తారన్నారు. అధికారుల బృందం క్షేత్రస్థాయిలో గురువారం తనిఖీలు నిర్వహించిందని తెలిపారు. సమావేశంలో రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీవనిధర్ రామన్, ఉమ్మడి జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారి శంకరరావు, ఇండస్ట్రీస్ ప్రమోషనల్ అధికారి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువత భవితకు 'దిక్సూచి'


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లయన్స్ ప్రతినిధులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: నిపుణులు చెప్పిన మాటలు ఉజ్వల భవితకు బాటలు వేస్తాయని లయన్స్ క్లబ్ జిల్లా మొదటి ఉపగవర్నర్ వజ్రపు కోటేశ్వరరావు పేర్కొన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ కార్యక్రమంలో భాగంగా లయన్స్ క్లబ్ రాజమండ్రి వజ్రం, లయన్స్ క్లబ్ రాజమండ్రి కడియం హార్టికల్చర్ సహకారంతో నగరంలోని ఆనం కళాకేంద్రంలో రెండురోజుల పాటు నిర్వహించే దిక్సూచి కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస నిపుణులతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆదిత్య కళాశాల డైరెక్టర్ ఎస్.పి.గంగిరెడ్డి మాట్లాడుతూ తెలిసిన అంశాలను వేదికపై ప్రదర్శించేందుకు విద్యార్థులు భయపడకూడదన్నారు. క్లబ్ రీజియన్ ఛైర్‌పర్సన్ ఎం.వాణిశ్రీ, జిల్లా పూర్వపు గవర్నర్ మాటూరి మంగతాయారు, లయన్ వేలూరి సూర్యనారాయణ, లింగమల్లు కృష్ణమూర్తి, బి.వి.ఎన్.రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ లక్ష్మారెడ్డి, అడ్వైజర్ విశ్వేశ్వరరావు తదితరులు మాట్లాడారు. నగరంలోని పలు కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు గంపా నాగేశ్వరరావు, వేణుకల్యాణ్, సినీనటుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు కె.వి.ప్రదీప్, ఐఏఎస్ కోచింగ్ నిపుణురాలు, విద్యావేత్త బాలలత, చార్టెడ్ అకౌంటెంట్ రాహుల్ వేదాంతం తదితరులు యువతకు మార్గనిర్దేశం చేశారు.

Collector's Office, Kakinada

Ref. Coordn/(Elecs)-1/188/2024. Dt. 24-10-2024

ANNEXURE A-1

ELECTION COMMISSION OF INDIA

Revision of Electoral Rolls for East-West Godavari Graduates' Constituency of Andhra Pradesh Legislative Council

Notice under rule 31(4) of the Registration of Electors Rules, 1960

In pursuance of rule 31(4) of the Registration of Electors Rules, 1960, the Electoral Registration Officer of East-West Godavari Graduates' Constituency vide Public notice Ref.Coordn/(Elecs)-1/188/2024, Dt.30-09-2024, called upon every person entitled to be registered In the electoral roll of the relevant Graduates' Constituency mentioned above, to send to, or deliver at, ERO's Office on or before 06-11-2024 (i.e., the last date of receipt of applications) application In Form-18 appended to the Registration of Electors Rules, 1960 and reproduced In the second schedule of the said notice published in the edition dated 30th September, 2024 of (1) Eenadu and (2) The New Indian Express News Papers.

All the above mentioned persons may submit their applications In Form-18 on or before 06-11-2024 (ie., the last date of receipt of applications), If not already done.

The said details are also available in the official website of the Chief Electoral Officer, Andhra Pradesh at www.ceoandhra.nic.in

Sd/- **Electoral Registration Officer**
East-West Godavari Graduates' Constituency &
District Revenue Officer, Kakinada.

నీటి చుక్కను ఒడిసిపడదాం..!



- మండలానికి వెయ్యి ఇంకుడు గుంతల తవ్వకం
- జిల్లా వ్యాప్తంగా రూ. 5.40 కోట్ల ఉపాధి నిధులతో పనులు


వర్షపు నీటిని ఒడిసిపట్టాలి. ఆ నీటిని భూమిలోకి ఇంకించాలి. పుడమి ఒడిలో భద్రంగా దాచాలి. భూగర్భ జలాలు కళకళలాడేలా చూడాలి. దీనికి ఎన్డీఏ ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ప్రజా భాగస్వామ్యంతో ఇంకుడుగుంతలు తవ్వించాలని నిర్ణయించింది. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల వారీగా లక్ష్యాలను నిర్దేశించింది. క్షేత్రస్థాయిలో ఉపాధి నిధులు ఖర్చు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. - న్యూస్‌టుడే, తాళ్లపూడి


ఇంకుడుగుంత తవ్వకం(పాతచిత్రం)

జిల్లా వ్యాప్తంగా 19 మండలాల్లోని మెట్ట ప్రాంతాలైన తొమ్మిది మండలాల్లో ఇంకుడు గుంతలు తవ్వాలని ఉన్నత స్థాయి అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. వీటిలో తాళ్లపూడి, నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం, రంగంపేట, రాజానగరం, కోరుకొండ, గోకవరం, సీతానగరం.. ఇలా 9 మండలాల్లో ఇంకుడుగుంతలు తవ్వకానికి చర్యలు చేపట్టింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఒక్కో మండలానికి వెయ్యి చొప్పున ఇంకుడు గుంతల తవ్వకానికి ఇటీవల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఒక్కో గుంత పొడవు, వెడల్పు 1.20 మీటర్లు ఉండాలని నమూనా ఆకృతిని సైతం పంపించారు. ఎన్ని సెం. మీ. పెద్ద, చిన్న కంకరాళ్లు ఎలా వాడాలో సూచించారు. ఇందుకోసం పనులు చేసిన కూలీల వేతనాలకు రూ.550, సామగ్రి కొనుగోలుకు రూ. 5,450 ఖర్చు చేయాలని అనుమతిచ్చారు. జిల్లా వ్యాప్తంగా చూస్తే ఒక్కో మండలానికి వెయ్యి చొప్పున తొమ్మిది మండలాల్లో 9 వేలు ఇంకుడుగుంతలను తవ్వాలి. ఈ లెక్కన చూస్తే ఒక్కో గుంతకు ఖర్చు రూ. 6 వేల చొప్పున లెక్కకడితే రూ.5.40 కోట్ల పరిపాలన అనుమతులు వచ్చాయి. ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న క్షేత్ర, సాంకేతిక సహాయకులు, ఏపీవో, ఏపీడీ, ఎంపీడీవోలు, ప్రణాళికను సిద్ధం చేసి వెంటనే పనులకు శ్రీకారం చుట్టాలని ఆదేశించారు.

జల సంరక్షణ ఇలా..

2014-19లో అప్పటి తెదేపా హయాంలో ఇంకుడు గుంతల తవ్వకం కార్యక్రమాన్ని ప్రభుత్వం యజ్ఞంలా చేపట్టింది. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం గత ఐదేళ్ల కాలంలో నీటి సంరక్షణకు మంగళం పాడేసింది. భూగర్భ జలాలను సంరక్షించే విధానంపై కన్నెత్తి చూడలేదు. తాజాగా ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇంకుడుగుంతల తవ్వకానికి శ్రీకారం చుట్టింది. ఎక్కడా నీటి చుక్క వృథాగా పోకుండా భూగర్భ జలాలు కళకళలాడేలా చూడాలని ఆదేశించింది. మురుగునీరు దుర్వాసన రాకుండా భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని తెలిపింది. వాన నీటిని ఒడిసిపట్టేందుకు ప్రతి ఒక్కరూ భగీరథుడిగా పని చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. వీధుల్లో నీరు ఎక్కువగా నిలిచే ప్రదేశాలను గుర్తించి ఇంకుడు గుంతలను తవ్వించాలని ఉన్నతస్థాయి నుంచి ఆదేశాలు వచ్చాయి. మురుగునీరు ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ పనులు చేపట్టాలన్నారు.


నమూనా ఇలా

జలస్ఫూర్తి నింపేలా..

అందరిలో జలస్ఫూర్తిని నింపేలా ఇంకుడు గుంతలు తవ్వాలని కార్యాచరణ రూపొందించాం. ప్రతి మండలంలోనూ వెయ్యి తవ్వాలని ఆదేశాలు వచ్చాయి. వీటిని రానున్న సంక్రాంతిలోగా పూర్తి చేయాలని ఆదేశించాం.

- రామ్‌ప్రసాద్, నరేగా, ఏపీడీ

నన్నయలో అంతర్ కళాశాలల బాస్కెట్‌బాల్ పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న వీసీ శ్రీనివాసరావు

నన్నయ విశ్వవిద్యాలయం(రాజానగరం): నన్నయ విశ్వవిద్యాలయంలో అంతర్ కళాశాలల పురుషుల బాస్కెట్‌బాల్ పోటీలు, విశ్వవిద్యాలయ జట్టు ఎంపిక కార్యక్రమానికి గురువారం వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు హాజరయ్యారు. ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచి వివిధ కళాశాలల క్రీడాకారులు విచ్చేయగా.. వారికి శుభాకాంక్షలు తెలిపి, బాస్కెట్‌బాల్ గోల్ వేసి పోటీలు ప్రారంభించారు. వీసీ ఆచార్య మాట్లాడుతూ.. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని నన్నయ విశ్వవిద్యాలయం తరఫున 42 రకాల క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రెండు రోజులు యూనివర్సిటీలో నిర్వహించనున్న ఇంటర్ కాలేజియేట్ బాస్కెట్‌బాల్ మెన్ టోర్నమెంట్ కమ్ యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్‌కు ఆయా కళాశాలల నుంచి 13 జట్లు, 12 మంది వ్యక్తిగత క్రీడాకారులు హాజరయ్యారన్నారు. నాకౌట్ కమ్ లీగ్ పద్ధతుల ద్వారా పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతిభావంతుల జట్టు నవంబరు 1నుంచి 5వ తేదీ వరకు బెంగళూరులో క్రైస్ట్ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటారన్నారు. రిజిస్ట్రార్, స్పోర్ట్స్ బోర్డ్ ఇన్‌ఛార్జి కో ఆర్డినేటర్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపల్ డా.కె.సుబ్బారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.మూర్తి, సెలక్షన్ కమిటీ సభ్యులు రైల్వే కోచ్ ప్రసాద్, బాపిరెడ్డి, అబ్బర్వర్ పీఆర్ కళాశాల పీడీ రమణ, విశ్వవిద్యాలయ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగ అధ్యాపకులు, పీడీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐ ఉద్యోగుల జిల్లా కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన సభ్యులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ వర్మ తదితరులు

గాంధీనగర్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐటీఐ, డీఎల్‌టీసీల అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవమైంది. కాకినాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో గురువారం ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. అతిథులుగా కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ ఎంవీజీ వర్మ, అసోసియేట్ రాష్ట్ర నాయకురాలు జి.మంగతాయారు, జిల్లా గౌరవాధ్యక్షుడు ఈజే మోహన్‌రావులు హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు ఎంఎన్ఎస్.మూర్తి, ఉపాధ్యక్షులు జి.విజయ్‌కుమార్, ఎం.ముక్తేశ్వరరావు, కార్యదర్శి పీజే.శ్రీనివాసబాబు, కోశాధికారి కె.శ్రీనుకుమార్, సహాయ కార్యదర్శులు ఎస్.సౌజన్య, ఎం.పద్మ, కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కాకినాడ యూనిట్ అధ్యక్షుడిగా వీవీఎల్.నరసింహారావు, కార్యదర్శిగా ఎస్ఏ.శంకరరావు, కోశాధికారిగా జి.శ్రీనివాసరావు తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉద్యోగులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి, ఐటీఐ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

రుడా ఆదాయ వనరులు పెంచేలా కార్యాచరణ

రాజమహేంద్రవరం కలెక్టరేట్: రాజమహేంద్రవరం నగర అభివృద్ధి సంస్థ(రుడా) పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను పీపీపీ విధానంలో చేపట్టి ఆదాయ వనరులు పెంచేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో రుడా అయిదో బోర్డు సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఖాళీస్థలాలను సద్వినియోగం చేసుకోవడం, రుడా పరిధిలో అనుమతులు జారీ కోసం వసూలు చేసే దరఖాస్తు రుసుం మొత్తాన్ని రూ.500 నుంచి రూ.వెయ్యికి పెంచే అంశాలపై చర్చించి సమావేశంలో సభ్యులు ఆమోదం తెలిపారు. పురపాలక సంఘాల పరిధిలో పార్కులు అభివృద్ధి చేయాలని సూచించారు. మాస్టర్‌ప్లాన్ పురోగతి, ప్లానింగ్ లేఔట్, భవన అనుమతి దరఖాస్తులు, యూజర్ ఛార్జీలు, డెవలప్‌మెంట్ ఛార్జీల పెంపుదల, దరఖాస్తుల్లో వచ్చే సమస్యలపై చర్చించారు. లేఔట్, భవనాల అభివృద్ధి ఛార్జీల పెంపును సమావేశంలో ఆమోదించారు. అభివృద్ధి పనులకు ఆపరేషనల్, మెయింటెనెన్స్‌తో కూడిన ప్రతిపాదనలు చేయాలని రుడా వైస్‌ఛైర్మన్ కేతన్‌గర్గ్‌కు కలెక్టర్ సూచించారు. రుడా కార్యదర్శి శైలజా గత బోర్డు సమావేశంలో జరిగిన అంశాలపై చర్యల నివేదికను వివరించారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	11,500
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	16,000
గటగట	13,500
కొత్తకాయ: గండేరా	15,500
గటగట	13,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	12,000-13,500
కొత్త (పచ్చి) కాయ	11,500-12,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	130-00
రిటైల్ లైవ్	152-00
డ్రెస్డ్	220-00
స్కిన్‌లెస్	251-00

పశ్చిమ గోదావరి డీఈఓగా నారాయణ



శ్యామలా సెంటర్ (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: పశ్చిమ గోదావరి జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి(పూర్తి అదనపు బాధ్యతలు)గా రాజమహేంద్రవరం డీవైఈఓ ఎల్. నారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు విడుదల చేసింది.

2న మంద కృష్ణ రాక

టి.నగర్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో నవంబరు 2న జరిగే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాదిగల ఆత్మీయ సమావేశంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పాల్గొంటారని సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు గురువారం జిల్లా కార్యాలయం వద్ద జరిగిన సన్నాహక సమావేశంలో సంఘం నాయకులు ముమ్మిడివరపు చిన సుబ్బారావు, వైరాల అప్పారావు మాట్లాడారు. మూడు జిల్లాలకు చెందిన మాదిగలు హాజరై సమావేశం విజయవంతం చేయాలన్నారు.

రాజమహేంద్రవరం


విజేతలతో పాఠశాల ఇంఛార్జి షణ్ముఖ్, ప్రిన్సిపల్ సౌజన్య


వ్యాసరచన పోటీలో శ్రీచైతన్య విద్యార్థులు

పుస్తక పఠనంతో జ్ఞానసముపార్జన

శ్యామలా సెంటర్ (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: నిరంతర పుస్తక పఠనంతోనే జ్ఞానసముపార్జన సాధ్యమని మోరంపూడి శ్రీచైతన్య పాఠశాల ఇంఛార్జి ఎ.షణ్ముఖ్ అన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం పాఠశాలలో వ్యాసరచన పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పదో తరగతి విద్యార్థి సీహెచ్ తపన్, 9వ తరగతి విద్యార్థి ఆర్.సాయి మణికంఠ, 8వ తరగతి విద్యార్థిని బి.సుదీక్ష మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను ఇంఛార్జి షణ్ముఖ్, ప్రిన్సిపల్ జీఎల్ సౌజన్య విద్యార్థులకు అందించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా బి.పృథ్వీ, బి.గీతిక వ్యవహరించారు.

అందుకున్నారు అవకాశాల లేఖ..


ఎంపికైన అభ్యర్థికి లేఖ అందజేస్తున్న జేసీ

వి.ఎల్.పురం: ఉద్యోగ మేళాల ద్వారా కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జేసీ చిన్నరాముడు సూచించారు. వికాస ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో ఎనిమిది ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేశారు. 118 మంది అభ్యర్థులు హాజరుకాగా వీరిలో 48 మంది ఆయా ఉద్యోగాలకు ఎంపికైనట్లు వికాస పీడీ కె.లచ్చారావు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జేసీ చిన్నరాముడు ఆఫర్ లెటర్లు అందించారు.

నగరం.. ఆటల విడిది


డిస్కస్‌త్రో విసురుతున్న క్రీడాకారుడు

కబడ్డీ.. పరుగు.. లాంగ్‌జంప్.. హైజంప్.. ఇలా క్రీడా పోటీలతో నగరం గురువారం కళకళలాడింది. ఒకవైపు జిల్లాస్థాయి పోలీస్ సిబ్బంది క్రీడా పోటీలు.. మరోవైపు అథ్లెటిక్స్‌కు అండర్-14 క్రీడాకారుల ఎంపికతో సందడి నెలకొంది. పోలీస్ క్రీడా పోటీలు మరో రెండు రోజుల పాటు కొనసాగనుండగా.. అథ్లెటిక్స్‌లో ఎంపికలు శుక్రవారంతో ముగియనున్నాయి.


కబడ్డీలో తలపడుతున్న పోలీసు క్రీడాకారులు


అథ్లెటిక్స్ హైజంప్‌లో దూకుడు

సినిమాలు: దానవాయిపేట : శ్యామల: వేట్టయన్, సూర్యప్యాలస్, స్వామి, అనుశ్రీ, రాజా, వీఎస్ మహల్: వెనమ్, కుమారి, అప్సర: దేవర, అశోక: విశ్వం, సూర్యమినీ: జనక అయితే గనక, శివజ్యోతి: పొట్టేల్, ఊర్వశి: లగ్గం, మేనక: నరుడి బ్రతుకు నటన, రంభ: సత్యం సుందరం, ఎంత పని చేశావ్ చంటి (రెండేసి ఆటలు).

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లలో)

దేవీచౌక్: టమాట-35, వంకాయలు(నలుపు-44/గులాబీ-54/తెలుపు-38/దొమ్మేరు-54), బెండ-46, కాకర-36, బీర(పందిరి-44/పొట్టివి-40), దొండ-28, క్యారెట్-38, బీట్‌రూట్-42, దోస-34, చిక్కుళ్లు-100, పచ్చిమిర్చి-36, బంగాళ దుంపలు-33, ఉల్లిపాయలు 52/కొత్తవి-35.


కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

కళాశాల కబుర్లు

కష్టపడితే విజయం

దేవీచౌక్! రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల దివ్యాంగుల కమిటీ, రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పోటీ పరీక్షలపై సివిల్స్ కోచింగ్ నిపుణురాలు బాల లత అతిథి ఉపన్యాసం గురువారం కళాశాలలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమను తాము నమ్ముకుని కష్టపడి ముందుకు నడిచినప్పుడే ఎంతటి విజయాన్నైనా సాధించవచ్చన్నారు. కష్టపడి చదివి ఈ రోజు ఐఏఎస్, ఐపీఎస్‌లుగా నిలిచిన పలువురి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్రరావు, వైస్ ప్రిన్సిపల్ శ్రీరామ్మూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

తైక్వాండోలో స్వర్ణ పతకం



రాజమహేంద్రవరం సాంస్కృతికం: కాకినాడలో ఏఎస్‌డీ ప్రభుత్వ మహిళా కళాశాలలో ఈనెల 23న జరిగిన అంతర్ కళాశాలల మహిళా టోర్నమెంట్‌లో తైక్వాండో 72 కేజీల విభాగంలో ఎస్‌కేవీటీ కళాశాల బీఎస్సీ విద్యార్థిని ఎల్.వైష్ణవి బంగారు పతకం సాధించిందని ప్రిన్సిపల్ ఎబెల్ రాజబాబు తెలిపారు. నవంబరు 9న అమృత్‌సర్‌లో జరిగే పోటీలకు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వైష్ణవిని వ్యాయామ విభాగాధిపతి పి.ఎ.కిశోర్‌బాబు తదితరులు అభినందించారు.


విజేతలతో వైస్ ప్రిన్సిపల్ తదితరులు

మద్యంతో కుటుంబ వ్యవస్థ నాశనం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: 'మద్యపానం హానికరం .. ఇంటింటా మద్యపాన ప్రక్షాళనకు శ్రీకారం' అంశంపై కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వక్తృత్వం, వ్యాసరచన పోటీలు గురువారం నిర్వహించారు. మహిళా సాధికారత విభాగం, ఆరోగ్యమే మహాభాగ్యం చైతన్య వేదికల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ రత్నకుమార్ మాట్లాడుతూ మద్యపానం అత్యంత ప్రమాదకరమని, కుటుంబ వ్యవస్థను నాశనం చేస్తుందన్నారు. మహిళా సాధికారత విభాగం అధ్యక్షురాలు ప్రభల శ్రీవల్లి, ఆరోగ్యమే మహాభాగ్యం చైతన్య వేదిక అధ్యక్షుడు చిప్పాడ రుద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనతో ఉన్నతంగా ఎదగాలి

రాజమహేంద్రవరం సాంస్కృతికం: విద్యార్థులు చక్కటి లక్ష్యంతో ముందుకు సాగుతూ ఉన్నతంగా ఎదగాలని ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ఆర్థికశాస్త్ర అధ్యాపకుడు ఎం.ఎస్.ఫణికుమార్ అన్నారు. గురువారం కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాల ఆర్థికశాఖ ఆధ్వర్యంలో జరిగిన అతిథి ఉపన్యాస కార్యక్రమంలో ఫణికుమార్ మాట్లాడారు. ప్రస్తుత కాలంలో అర్థశాస్త్ర ప్రాధాన్యత, ఉద్యోగ అవకాశాలను వివరించారు. వైస్ ప్రిన్సిపల్ రత్నకుమార్, డి.వి.కె.ఎస్.లక్ష్మి తదితరులు ఫణికుమార్‌ను సత్కరించారు.

ప్రపంచమంతా డిజిటల్ మార్కెటింగ్‌వైపే..

రాజమహేంద్రవరం సాంస్కృతికం: స్వశక్తి.. నవ కల్పనలతో ప్రతి విద్యార్థి స్వయం ఉపాధికి బాటలు వేసుకుని వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఐటీ సొల్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ వి.విద్యాసాగర్ అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'వెబ్ డిజైనింగ్, డిజిటల్ మార్కెటింగ్ ఇన్ ఫీచర్' అంశంపై కార్యశాలలో ఆయన ప్రధాన వక్తగా ప్రసంగించారు. విద్యార్థులు సృజనాత్మక శక్తిని అలవరచుకోవాలన్నారు. ప్రపంచమంతా డిజిటల్ మార్కెటింగ్ వైపే ఉందన్నారు. కంప్యూటర్ విభాగాధిపతి కె.శారద మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుని నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. ప్రిన్సిపల్ ఎబెల్ రాజబాబు మాట్లాడుతూ భవిష్యత్తు అంతా వెబ్ డిజైనింగ్‌పై ఉందని, విద్యార్థులు కృషితో ఎదగాలన్నారు. కేవీ రాజేష్ మాట్లాడుతూ వెబ్ డిజైనింగ్ పనితీరు, భవిష్యత్తులో వాటి అవసరాలు అంశంపై వివరించారు.

మారుతున్న అలవాట్లే క్యాన్సర్‌కు కారణం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవన విధానమే క్యాన్సర్ సంబంధిత వ్యాధులు పెరగడానికి కారణమని అంకాలజిస్ట్ పట్నాల విశ్వనాథ్ అన్నారు. పిల్లల్లో క్యాన్సర్‌పై లయన్స్ క్లబ్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో వీఎల్ పురం చైతన్య జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. పిల్లలు సెల్‌ఫోన్ వాడకం వల్ల రేడియేషన్ మూలంగా క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. క్లబ్ అధ్యక్షుడు శ్రీరామగుప్తా, చైతన్య కళాశాల ఏజీఎం కె.గోవిందరాజు, క్లబ్ అడ్మిన్ వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విశ్వనాథ్

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

దేవీచౌక్: అత్యవసర మరమ్మతుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు.

సమయం: ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు

ప్రాంతాలు: మెయిన్‌రోడ్డు, కంభం సత్రం వీధి, వంకాయలవారి వీధి, ఉల్లితోట వీధి, టౌన్‌హాలు రోడ్డు, మెరక వీధి, ఇసుక వీధి, నాళం భీమరాజు వీధి, రంగ్రీజు పేట, చందా సతం వీధి, గుండువారి వీధి, సదనం, గోదావరిబండ్, పుష్కరఘాట్, టి.నగర్, ఇస్కాన్ ఆలయ ప్రాంతం, కోటిపల్లి బస్టాండ్.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

టి.నగర్, న్యూస్‌టుడే: నగరంలో తలపెట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ కేతన్ గర్గ్ ఆదేశించారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగంతో నిర్వహించిన సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కొత్త రహదారులు, కాలువల విస్తరణపై నివేదిక ఇవ్వాలన్నారు. రోడ్ల మధ్య తప్పనిసరిగా డివైడర్లు ఏర్పాటు చేసి, మధ్యలో మొక్కలు పెంచేందుకు అనుకూలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పోలియో నిర్మూలనకు బాలల విరాళం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ లిటిల్ పారడైజ్ రివర్ సిటీ ఆధ్వర్యంలో ప్రపంచ పోలియో దినం సందర్భంగా గురువారం క్లబ్ అధ్యక్షురాలు అన్నీ షాన్విక నిర్వహణలో గురువారం కార్యక్రమం జరిగింది. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం రివర్ సిటీ పోలియో విభాగం ఛైర్మన్ సీహెచ్.రాజేశ్వరరావు మాట్లాడారు. లిటిల్ పారడైజ్ ఇంటరాక్ట్ క్లబ్ విద్యార్థుల నుంచి పోలియో నిర్మూలనకు రూ.50 వేలు విరాళంగా సేకరించామని క్లబ్ అధ్యక్షురాలు అన్నీ షాన్విక తెలిపారు.

ఒలింపియాడ్ పరీక్షలో ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులు

దానవాయిపేట: కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఇండియన్ ఒలింపియాడ్ క్వాలిఫైర్ గణిత పరీక్ష(ఐఓక్యూఎం)లో రాజమహేంద్రవరం శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ఐపీఎల్ శాఖ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని విద్యాసంస్థల ఏజీఎం ఎంవీ సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను గురువారం అభినందించారు. రీజనల్ ఇంఛార్జి ఉదయ్ శంకర్ మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీలేదన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ సౌజన్య మాట్లాడుతూ విద్యార్థులు లెవెల్-2లోను ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ అరుణ్, ఐపీఎల్ ఇన్‌ఛార్జి రాయుడు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

ఉద్యానం.. ఏదీ ఆహ్లాదం

● ప్రధాన పార్కులకే అభివృద్ధి పరిమితం

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ


పుష్కరాలకు గోదావరి గట్టున ఉన్న పార్కులో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెన్ ఇలా..

కొన్నిచోట్ల పచ్చదనం మచ్చుకు కనపడదు.. ఆట వస్తువులున్నా చాలాచోట్ల అలంకారప్రాయమే. మరుగుదొడ్లు ఉన్నచోట్ల నిర్వహణ అధ్వానం.. ఇదీ నగరంలో పలు ఉద్యానాల్లో పరిస్థితి. ప్రధాన పార్కులు మినహాయిస్తే మిగిలినవి కళావిహీనంగా మారాయి. నగరవాసికి ఆహ్లాదం కరవైంది.

నగరంలో మొత్తం 50 డివిజన్లు ఉన్నాయి. రెండు డివిజన్లకు ఒకటి చొప్పున 25 వరకు ఉద్యానాలున్నాయి. సాయంత్రం పూట కాసేపు సేద దీరుతామని వెళ్లినా ఆహ్లాదం కరవు. ఏ సెలవు పూటో పిల్లలు ఆడుకుందామని పార్కుకు వెళితే సగం పరికరాలు పనిచేయవు.


మున్సిపల్ కాలనీలో పార్కులో ఊయల బల్లలు మాయం

నాడు రూ.9 కోట్లు ఖర్చు చేసినా..

గత పుష్కరాలకు నగర సుందరీకరణలో భాగంగా ప్రత్యేక నిధులు కేటాయించారు. సుమారు రూ.9 కోట్లతో అప్పట్లో 25 ఉద్యానాలను తీర్చిదిద్దారు. పచ్చదనం, ఆట వస్తువులతో వసతులు కల్పించారు. ఆ తర్వాత నిర్లక్ష్యం ఆవహించింది. కంబాలచెరువు, దానవాయిపేట, ప్రకాశంనగర్, జేఎన్ రోడ్డు తదితరచోట్ల మినహా మిగిలిన అన్నిచోట్లా సమస్యలు కనిపిస్తున్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో కంబాల చెరువు పార్కును విస్తరించి దానికి టికెట్ పెట్టడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. గ్లోగార్డెన్ పేరుతో లాలాచెరువు రోడ్డులో రంగుల వెలుగుల్లో జంతువుల బొమ్మలతో నింపేసి దానికీ టికెట్ పెట్టారు. డివిజన్లలో ఉన్న పార్కుల్లో సౌకర్యాలు మెరుగుపర్చాల్సి ఉంది.

2020 నుంచి సాగుతునే ఉన్నాయ్...

గతంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో కొన్నిచోట్ల పార్కుల విస్తరణ పనులు తలపెట్టినా ఇప్పటికీ పూర్తి కాలేదు. పదో డివిజన్ మోడల్ కాలనీ, 16వ డివిజన్ వాంబే గృహాల వద్ద ఒక్కోటి రూ.70 లక్షల నిధులు వెచ్చించి చేపట్టినా చివరకు మూలకు చేరాయి. 2020లో ఈ పార్కు విస్తరణ పనులు చేపట్టినప్పటికీ ఇప్పటికీ పూర్తి చేయకపోవడం గమనార్హం. ఎస్‌బీవి కాలనీ, భాస్కర్‌నగర్, పద్మావతి పార్కు అభివృద్ధి పనులు తలపెట్టగా ఎట్టకేలకు కొలిక్కి వచ్చాయి. గత పుష్కరాలకు గోదావరి గట్టును ఆనుకొని పీవీ నరసింహారావు పార్కు, పక్కన నందనవనం పార్కులు అభివృద్ధి చేసినా.. ఇక్కడా ప్రస్తుతం నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. అధికార యంత్రాంగం స్పందించాల్సి ఉంది.


పీవీ నరసింహారావు పార్కులో జారుడుబల్ల

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

సమస్యలకు పరిష్కారం

● వీరభద్రపురంలోని రామాలయం ఎదురు వీధిలోని డ్రెయిన్‌లో పడేసిన చెట్ల కొమ్మలు, కాలువలో పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య సిబ్బంది తొలగించి శుభ్రం చేసినట్లు ఫిర్యాదుదారుడు అనంత్ తెలిపారు.

● చౌడేశ్వరినగర్ శివారువీధి బీటీ రోడ్డులో పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారని ఫిర్యాదుదారుడు భాస్కరరాజు తెలిపారు.

● మెరకవీధిలోని జట్లసంఘం కార్యాలయం వీధిలో డ్రెయిన్‌లో చెత్తను తొలగించి సమస్య పరిష్కరించినట్లు ఫిర్యాదుదారుడు ధనుంజయరావు చెప్పారు.

– న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

సమస్యలపై సంప్రదించాల్సిన నంబర్లు **83282 39927** **80089 02897**

నిపుణుల మాట.. విద్యార్థులకు మార్గదర్శనం


కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, మాట్లాడుతున్న బాల లత

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ రాజమండ్రి వజ్రం, కడియం హార్టికల్చర్ సహకారంతో ఆనం కళాకేంద్రంలో గురువారం ప్రారంభమైన దిక్సూచి కార్యక్రమం విద్యార్థుల భవితకు మార్గనిర్దేశనం చేసింది. పలువురు ప్రముఖులు హాజరై విలువైన సూచనలు అందించారు.

భయం అధిగమిస్తే విజయం

ఎంత విద్యాధికులైనా వేదికపై మాట్లాడేందుకు కొందరు భయపడతారు. ఎంచుకున్న అంశంలో తడబాటు లేకుండా చెప్పడానికి భయమెందుకు? దాన్ని అధిగమిస్తే విజయం మనతోనే ఉంటుంది. చక్కటి లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా భవితకు బాటలు వేసుకోవాలి. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి.

– గంపా నాగేశ్వరరావు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు

బలమైన పునాదితోనే భవిత

'యద్భావం తద్భవతి' మిమ్మల్ని మీరు ఎలా చూడాలనుకుంటున్నారో అలాగే జరుగుతుంది. భవితకు పునాది బలంగా వేసుకోవాలి. ఉన్నతమైన ఆలోచనలతో ప్రణాళిక రూపొందించుకోవాలి. తద్వారా విజయం వెన్నంటే ఉంటుంది.

– కె.వి.ప్రదీప్, సినీనటుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు

ముందేరోజు ఓ ప్రణాళిక ఉండాలి..

లక్ష్యం సాధించాలంటే తగిన విధంగా శ్రమించాలి. మర్నాడు ఏం చేయాలనేది నిద్రపోయే ముందు ఓ ప్రణాళిక ఉండాలి. ముందు రోజు ఏదైతే అనుకున్నామో వాటిని తప్పనిసరిగా పూర్తి చేయాలి. లక్ష్యం వైపు చిత్తశుద్ధితో ఎప్పుడు అడుగులు వేస్తామో అప్పుడే అవి చేరువవుతాయి.

– బాల లత, ఐఏఎస్ కోచింగ్ నిపుణురాలు, విద్యావేత్త

తెలివితోపాటు నైపుణ్యాభివృద్ధితోనే గమ్యం

చదువుతోపాటు ఆర్థికపరమైన అంశాలను నేర్చుకోవాలి. తెలివితోపాటు నైపుణ్యం పెంచుకోవాలి. నైపుణ్యాభివృద్ధితో గమ్యం చేరడం సులభం. జీవితంలో ఉన్నత స్థాయికి చేరిన వ్యక్తుల జీవితాలను అధ్యయనం చేయాలి.

– వేణుకల్యాణ్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు

మాజీ ఎంపీలో మార్పు రాలేదు: ఎమ్మెల్యే


పుష్కరఘాట్ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

దేవీచౌక్, న్యూస్‌టుడే: గత ఎన్నికల్లో ఓడినా మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్‌లో ఎటువంటి మార్పు రాలేదని నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు విమర్శించారు. మోరంపూడి ఫ్లై ఓవర్ గుత్తేదారుని ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. రాజమహేంద్రవరంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనపై మాజీ ఎంపీ చేస్తున్న ఆరోపణలు అర్థరహితమన్నారు. మద్యం దుకాణాల కోసం భరత్‌రామ్ తీవ్రంగా ప్రయత్నించారన్నారు. నగరంలో ఆక్రమణల తొలగింపునకు ప్రజలు స్వచ్ఛందంగా సహకరిస్తున్నారని, పుష్కరాల నాటికి పరిస్థితి చక్కదిద్దుతామన్నారు. ఈ నెల 26 నుంచి తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. నగర ప్రజలకు తాను అయిదు హామీలు ఇచ్చానని, ఈ నాలుగున్నర నెలల్లోనే అవి అమలుకు నోచుకుంటున్నాయన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 26న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. యువతకు మరో తీపికబురు చెబుతానని వెల్లడించారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

టి.నగర్: కార్తికం పుణ్యస్నానాల కోసం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. గోదావరి ఘాట్లను గురువారం ఆయన పరిశీలించారు. ఘాట్ల వద్ద దుస్తులు మార్చుకునే గదులు, విద్యుత్తు, మరుగుదొడ్లు, తాగునీరు సదుపాయాలు కల్పించాలన్నారు.

పైవంతెనపై 15 రోజుల్లో దీపాలు వేయకుంటే ధర్నా


పై వంతెనను పరిశీలిస్తున్న భరత్‌రామ్

వి.ఎల్.పురం: మోరంపూడి పై వంతెనపై 15 రోజుల్లో దీపాలు ఏర్పాటు చేయాలని, లేకుంటే ధర్నా చేస్తానని మాజీ ఎంపీ భరత్‌రామ్ చెప్పారు. కనీసం విద్యుత్తు దీపాలు కూడా ఏర్పాటు చేయకుండా వంతెన ప్రారంభించేశారని, ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. పార్టీ నాయకులతో కలిసి గురువారం పై వంతెన, సర్వీసు రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్తిస్థాయిలో పనులు జరిగాయా లేదా అనేది కూడా చూడకుండా పైవంతెన ప్రారంభించారని విమర్శించారు. మలుపుల వద్ద రోడ్డు స్కట్స్, మార్జిన్ వంటివి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఏర్పాటు చేయలేదని, కనీసం ప్రస్తుత ప్రజాప్రతినిధులైనా దీనిపై ప్రశ్నించాలి కదా అంటూ మండిపడ్డారు. జాతీయ రహదారి పక్కనే మద్యం దుకాణాల ఏర్పాటుకు ఎలా అనుమతి ఇచ్చారని అధికారులను ప్రశ్నించారు. నగరంలోని జేఎన్ రోడ్డులో పెట్టిన మద్యం దుకాణాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు.

బాలలకు చదవడం.. రాయడం రావాలి

శ్యామలా సెంటర్: ప్రాథమిక స్థాయి విద్యార్థులు వారి తరగతులకనుగుణంగా నిర్దేశించిన స్థాయిలో ప్రమాణాలు ఉండాలని ఎల్.నారాయణ అన్నారు. ప్రభుత్వ నేషనల్ సీనియర్ బేసిక్ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థులు చదవటం, రాయటం పట్ల ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులంతా బడిలో భోజనం చేసేలా అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రధానోపాధ్యాయిని రాధామణి, ప్రసాద్ పాల్గొన్నారు.

'శవ రాజకీయాలు చేస్తున్నారు'

టి.నగర్: బద్వేల్‌లో బాలిక ఘటన విషయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారని తెదేపా నూర్ భాషా సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ షేక్ సుభాన్ గురువారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. తన అయిదేళ్ల పాలనలో వైకాపా వాళ్లు చేసిన హత్యలకు జగన్ సమాధానం చెప్పాలన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్ర గాయాలు

రాజమహేంద్రవరం నేరవార్తలు: తాడితోట బైపాస్ రోడ్డు నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపుగా వెళ్తున్న ఓ ఆర్టీసీ బస్సు తాడితోట కూడలి వద్ద రోడ్డు దాటుతున్న వృద్ధుడ్ని ఢీకొంది. ఆ ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో ఉండడంతో స్థానికులు అంబులెన్సులో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వర్గాలు ఒకటో పట్టణ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తి వివరాలు తెలియరాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని..

పీ అండ్ టీ కాలనీకి చెందిన కె.త్రినాథ్ ద్విచక్ర వాహనంపై బుధవారం రాత్రి కోరుకొండ రోడ్డు బిజీలి ఐస్ ఫ్యాక్టరీ సమీపంలో వెళ్తుండగా మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన అతడు నగరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి వర్గాలు మూడో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

తక్షణ ప్రవేశాలు కల్పించాలని వినతి

నన్నయ విశ్వవిద్యాలయం(రాజానగరం): పీజీసెట్ రాయని అభ్యర్థులకు సైతం విశ్వవిద్యాలయంలో పీజీ చదువుకునే విధంగా తక్షణ ప్రవేశాలు కల్పించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థుల సంఘం (అనూరా) నాయకులు కోరారు. నన్నయ వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావును అనూరా అధ్యక్షులు గాదె కిషోర్, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ కె.కమలకుమారి, సభ్యులు కలిసి గురువారం విన్నవించారు.

'వక్ఫ్ సవరణ బిల్లుతో నష్టమే'

దానవాయిపేట: కేంద్రం వక్ఫ్ సవరణ బిల్లు 2024 తీసుకురావడం ముస్లింలకు నష్టం తప్ప.. మేలు జరిగేదేమీలేదని జమాతే ఇస్లాం హింద్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ రఫీ పేర్కొన్నారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ నిమిత్తం జమాతే ఇస్లాం హింద్ నగర అధ్యక్షుడు షేక్ అన్సర్ అహ్మద్ ఆధ్వర్యంలో నెహ్రూ నగర్‌లోని బిలాల్ షాదీఖానా ఆవరణలో గురువారం సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రఫీ మాట్లాడుతూ నూతన బిల్లు ముస్లింల ఆర్థిక స్థితిగతులను బలహీనపరుస్తుందన్నారు. ప్రస్తుతం ఉన్న చట్టాలు సక్రమంగా అమలు చేస్తే సరిపోతుందన్నారు. విజయవాడలో నవంబరు 3న జరిగే వక్ఫ్ పరిరక్షణ మహా సభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సభ గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెదేపా మైనార్టీ నాయకులు షేక్ సుభాన్, అసదుల్ల అహ్మద్, షేక్ కరీమ్, వివిధ మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఆల్కట్ గార్డెన్స్‌లో ఆక్రమణల తొలగింపు



రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ: నగరంలో ఆక్రమణల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. దీనిలో భాగంగా గురువారం ఆల్కట్ గార్డెన్స్, రైల్వే స్టేషన్ ఎదురుగా రోడ్డుపై ఆక్రమణలు తొలగించారు. రోడ్డుపై వ్యాపారాలు, కాలువలపై నిర్మాణాలను గుర్తించి, జేసీబీలతో తొలగించారు. కొత్త మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా విస్తరణ పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు తెలిపారు.

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

స్వామి శరణం.. అయ్యప్ప శరణం

రంగంపేట: అయ్యప్ప నామస్మరణతో రంగంపేట మండలం ఈలకొలను మారుమ్రోగింది. వందలాది మంది అయ్యప్పమాల ధరించిన భక్తులు పడిపూజ, భజనలు చేయడంతో స్థానికంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. రంగంపేటతో పాటు పరిసర మండలాల భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. జిల్లా తెదేపా ప్రధానకార్యదర్శి ఆళ్ళ గోవిందు, మండల తెదేపా అధ్యక్షుడు ఎలుబండి సత్తిబాబు, కడిమి సాయిబాబు గురుస్వాములు పాల్గొన్నారు.



ఈలకొలను పడిపూజలో అయ్యప్ప భక్తులు

వరద బాధితులకు రూ.లక్ష సహాయం

కోరుకొండ, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం శ్రీరంగపట్నం గ్రామస్థులు సేకరించిన నగదును తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీవీఆర్ చౌదరికి అందజేశారు. మండలంలోని బూరుగుపూడి గేటు సమీపంలోని తెదేపా నియోజకవర్గ కార్యాలయంలో గురువారం జరిగిన మండల స్థాయి తెదేపా సమావేశంలో రూ.1.09 లక్షల నగదును బీవీఆర్‌కు అందించారు. తనకాల నాగేశ్వరరావు, కంటే కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



బీవీఆర్‌కు నగదు అందజేస్తున్న తెదేపా నాయకులు

తాగునీటి గొట్టాలపై సిమెంటు పనులు

బయటపడిన వైకాపా ప్రభుత్వ తప్పిదాలు

స్పందనకు వందనం

సీతానగరం, న్యూస్‌టుడే: సార్వత్రిక ఎన్నికల వేళ వైకాపా ఓట్ల రాజకీయాలతో చేసిన పనులకు పంచాయతీలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. రాజమహేంద్రవరం, సీతానగరం రహదారి విస్తరణ పనులు నాలుగేళ్ల పాటు వదిలేసిన వైకాపా నాయకులు ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో వేగవంతం చేస్తున్నట్లు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. రాపాక నుంచి శ్రీరామనగరం వరకు సీసీ రోడ్డు హడావుడిగా వేశారు. సీసీ రోడ్డు అడుగున పంచాయతీ తాగునీటి గొట్టాలు ఉండిపోయాయి. ఆ గొట్టాలన్నీ నలిగిపోయి రంధ్రాలు పడడంతో సిమెంటు రోడ్డును బీటలిస్తుంటూ నీరు బయటకు వస్తోంది. దీంతో శివారు ప్రాంతాలకు నీరు చేరడం లేదు. దీంతో పలుమార్లు స్థానికులు ఆందోళనకు దిగారు. సంబంధిత రోడ్డు గుత్తేదారుడిని అడగగా బిల్లుల్లో జాప్యం ఉండడంతో అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. సమస్యను 'ఈనాడు' ప్రచురించగా సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించారు. సుమారుగా 450 మీటర్ల తాగునీటి గొట్టాలు సీసీ రోడ్డు కింద ఉండిపోయినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గుర్తించారు. కొత్తగా పైపులైన్ వేసి రావాల్సి ఉందని ఆ శాఖ ఇచ్చిన నివేదికతో గురువారం పనులు ప్రారంభించారు. ఈ పనులకు సుమారు రూ.3 లక్షల నిధులు పంచాయతీ నుంచి ఖర్చుపెట్టి తీర్మానం చేశామని కార్యదర్శి సురేష్ తెలిపారు.



రాపాక నుంచి శ్రీరామనగరం పైపులైన్ పనులు

ఉచిత దంత వైద్య శిబిరం

రాజానగరం, న్యూస్‌టుడే: గైట్ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో జీఎస్‌ఎల్ దంత వైద్య కళాశాల వారు ఉచిత దంత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. రెండు రోజులు నిర్వహించే ఉచిత దంత వైద్య శిబిరాన్ని విద్యార్థులు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ డా. కె.వల్లీ మాధవి కోరారు. శిబిరంలో 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.కాళికృష్ణ, దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.గంటా సునీల్, హెచ్‌ఓడీ రమేష్, డా.మౌనికా రెడ్డి, క్యాంప్ కోఆర్డినేటర్ డా.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ.. సాగుకు రక్షణ

✦ క్షేత్రస్థాయి అభ్యాసంతో వ్యవసాయ రంగంలో పూర్తి అనుభవం

✦ కేవీకేలో తర్ఫీదు పొందుతున్న 45 మంది విద్యార్థినులు

న్యూస్‌టుడే, రాజానగరం

వ్యవసాయం, అనుబంధ రంగాలపై క్షేత్రస్థాయిలో శిక్షణ పొందడం ద్వారా వచ్చే అనుభవంతో.. వృత్తిలో నైపుణ్యం సంపాదించడానికి వీలవుతుంది. అలాగే, రైతులకు అవసరమైన సమయంలో ఉపయుక్తమైన సలహాలు, సూచనలు అందించి అధిక దిగుబడులకు వీలు కల్పించవచ్చు. వ్యవసాయ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అగ్రికల్చర్ నాలుగేళ్ల కోర్సు చదివే విద్యార్థులకు ఆఖరి సంవత్సరంలో 'గ్రామీణ వ్యవసాయ పని అనుభవం (రూరల్ అగ్రికల్చరల్ వర్క్ ఎక్స్‌పీరియన్స్)' 'రావే' ప్రోగ్రాం కింద నాలుగు నెలలు క్షేత్ర స్థాయి శిక్షణ కార్యక్రమం ఉంటుంది. ఇందులో భాగంగా విజయవాడలోని మేరీ స్టెల్లా వ్యవసాయ కళాశాలకు చెందిన 45 మంది విద్యార్థినులు సీటీఆర్ఐ ఆధ్వర్యంలో పనిచేస్తున్న కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రంలో నాలుగు నెలలుగా తర్ఫీదు పొందుతున్నారు. ఈ శిక్షణ నవంబరులో పూర్తి కానున్నది. ఈనేపథ్యంలో వారు తెలుసుకున్న విషయాలను, పొందిన అనుభవాలను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.



అరటిలో అంతర పంటగా పసుపు మొక్కల సాగు పరిశీలిస్తున్న విద్యార్థినులు



కొబ్బరి పీచుతో తయారుచేసిన డోర్ మ్యాట్‌లను ప్రదర్శిస్తూ..

శిక్షణ పొందిన అంశాలు..

తూర్పు గోదావరి జిల్లాలోని వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పెరిగే వ్యవసాయ పంటలతో పాటు, ఉద్యానపంటలు, పాడి పరిశ్రమ, గృహవిజ్ఞానంపై శిక్షణ పొందామని విద్యార్థినులు తెలిపారు. గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా కలవచర్ల అనుబంధంగా వివిధ గ్రామాల్లో రైతుల అనుభవాలను సేకరించి సంకలనం చేశామన్నారు.

ప్రకృతి వ్యవసాయం గురించి..

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగింది. పంట దిగుబడి పెరగడంతో పాటు, ఆరోగ్యకరమైన, పోషక విలువలు కలిగిన పంటను పొందవచ్చని గ్రహించాం. రసాయన ఎరువులకు బదులుగా నారుమడి పెంపకం, పంటను ఆశించే చీడపీడలు, నివారణా చర్యలు తెలుసుకున్నాం.



- జి.తులసి

కూరగాయల సాగు తెలిసింది

ఉద్యాన పంటల విభాగం ద్వారా నర్సరీ యాజమాన్యం, ప్రోట్రేలలో కూరగాయల సాగు, కోకోపిట్ ఉపయోగం, వర్మీ కంపోస్టు తయారీ, వాడకంపై అవగాహన పొందాను. వ్యవసాయ, ఉద్యాన పంటలలో కలుపు నివారణ ఎలా చేయాలో నేర్చుకున్నాను. ముఖ్యంగా పార్థీనియం కలుపు నివారణపై అవగాహన వచ్చింది.



- ఎ.గంగా భవాని

క్రిమి సంహారకాల వాడకం తగ్గాలి

రసాయన, క్రిమి సంహారక మందుల వినియోగంపై అవగాహన పొందాను. వాటి వాడకాన్ని తగ్గించాల్సిన అవసరాన్ని గుర్తించాను. వివిధ స్ప్రేయర్ల వాడకం, నానో ఎరువుల వాడకంపై అవగాహన కలిగింది.



- కె.దివ్య

విలువ ఆధారిత పదార్థాలు గ్రహించా

విలువ ఆధారిత పదార్థాల తయారీపై శిక్షణ పొందాను. వ్యాక్యూమ్ ప్యాక్ తయారు చేశా. కూరగాయలు, పండ్ల రసాలు, మాంసాహారంలో ఉన్న పోషక విలువల గురించి అవగాహన కలిగింది. అంతర పంటల సాగు ఎలా చేయాలి, దానివల్ల కలిగే ప్రయోజనం ఏమిటో తెలుసుకున్నాను. ఇవి రైతులకు వివరిస్తాను.



- కె.సూసన్ జాయిస్

ఉచిత పశు వైద్య శిబిరం

నేడు

బిక్కవోలు: బిక్కవోలు పశువుల ఆసుపత్రిలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అనపర్తి పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు తెలిపారు. మండపేట నుంచి నిపుణులైన వైద్యులు వస్తున్నారన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం..

రంగంపేట: రంగంపేట, వడిశలేరు, ఈలకొలను విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలోని చంద్రేడు, పెదరాయవరం, వెంకటాపురం, కోటపాడు, ముకుందవరం, ఈలకొలనులలో శుక్రవారం విద్యుత్తు సరఫరా ఉండదని డీఈ శ్రీధర్‌వర్మ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్తు మరమ్మతులు చేయడంతో సరఫరా ఉండదన్నారు.

బొమ్మూరులో ఉద్యోగ మేళా

ధవళేశ్వరం(హుకుంపేట): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో బొమ్మూరు ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు సంస్థ అధికారి హరీష్ చంద్రప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంగా సుధాకర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 73967 40041, 90636 48365 నంబర్లను సంప్రదించాలని ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రాధాకృష్ణ తెలిపారు.

తక్షణ ప్రవేశాలు కల్పించాలని వినతి

రాజానగరం: పీజీసెట్ రాయని అభ్యర్థులకు సైతం విశ్వవిద్యాలయంలో పీజీ చదువుకునే విధంగా తక్షణ ప్రవేశాలు కల్పించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థుల సంఘం (అనూరా) నాయకులు కోరారు. నన్నయ వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావును అనూరా అధ్యక్షులు గాదె కిషోర్, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ కె.కమలకుమారి, కార్యదర్శి, స్పృహ అలూమ్ని అధ్యక్షులు ఎస్.నాగేంద్రకిషోర్‌కలసి వినతిపత్రం అందజేసారు.

ఇళ్ల పట్టాల పంపిణీలో అవకతవకలు: ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం: రాజానగరం సాయిబాబా ఆలయం సమీపంలో పశుసంవర్ధక శాఖకు చెందిన స్థలంలో ఇచ్చిన ఇళ్ల పట్టాల పంపిణీలో అవకతవకలు కనిపిస్తున్నాయని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సదరు పట్టాదారుల సమస్యల పరిష్కార వేదికను గురువారం నిర్వహించారు. పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సదరు స్థలంలో 435 మందికి పట్టాలు ఇచ్చినట్లుగా ఉండగా. . ఆన్‌లైన్‌లో 318 మందికి మాత్రమే ఇచ్చినట్టు కనిపిస్తోందని అన్నారు. ఇందులోనూ కేవలం 16 మంది మాత్రమే ఫొటోలతో పట్టాలు ఉన్నాయన్నారు. సుమారు 117 పట్టాలు లబ్ధిదారులకు చేరకుండా అప్పటి బడా నాయకుల వద్ద ఉండిపోయాయని ఆరోపించారు. దీనిపై ఎమ్మార్వో సమక్షంలో విచారణ నిర్వహిస్తామని తెలిపారు. రోడ్లు, కాలువలు, వీధిలైట్లు వేయించి అప్పగించే బాధ్యత తీసుకుంటానన్నారు. అనుమతి లేకుండా విద్యుత్తు వినియోగించుకుంటే పెద్దఎత్తున అపరాధ రుసుములు చెల్లించాల్సి ఉంటుందని, ఎవరూ తొందర పడవద్దని ఆయన పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

పుస్తక పఠనంతో జ్ఞాన సముపార్జన

శ్యామలా సెంటర్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: నిరంతర పుస్తక పఠనంతోనే జ్ఞానసముపార్జన సాధ్యమని మోరంపూడి శ్రీచైతన్య పాఠశాల ఇన్‌ఛార్జి ఎ. షణ్ముఖ్ అన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం పాఠశాలలో వ్యాసరచన పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పదో తరగతి విద్యార్థి సీహెచ్ తపన్, 9వ తరగతి విద్యార్థి ఆర్.సాయి మణికంఠ, 8వ తరగతి విద్యార్థిని బి.సుదీక్ష మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను ఇన్‌ఛార్జి షణ్ముఖ్, ప్రిన్సిపల్ జీఎల్ సౌజన్య విద్యార్థులకు అందించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా బి.పృథ్వీ, బి.గీతిక వ్యవహరించారు.



వ్యాసరచన పోటీలో విద్యార్థులు



విజేతలతో పాఠశాల ఇన్‌ఛార్జి షణ్ముఖ్, ప్రిన్సిపల్ సౌజన్య

అందుకున్నారు అవకాశాల లేఖ..

వి.ఎల్.పురం: ఉద్యోగ మేళాల ద్వారా కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జేసీ చిన్నరాముడు సూచించారు. వికాస ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో ఎనిమిది ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేశారు. 118 మంది అభ్యర్థులు హాజరుకాగా వీరిలో 48 మంది ఆయా ఉద్యోగాలకు ఎంపికైనట్లు వికాస పీడీ కె.లచ్చారావు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జేసీ చిన్నరాముడు నియామక పత్రం అందించారు.



అభ్యర్థికి నియామక పత్రం అందజేస్తున్న జేసీ

అక్రమాలకు కొత్త తెరలు!

సీతానగరం, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక విధానంలో సీతానగరం మండలంలో అక్రమార్కుల రవాణా ఆగడం లేదని 48 గంటల వ్యవధిలోనే కలెక్టర్ జోక్యం చేసుకుని రీచ్‌లు ఆపేశారు. ఎడ్లబండ్లకు మాత్రమే నదీగర్భంలో ఇసుక తవ్వకాలు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఇదే సమయంలో ట్రాక్టర్ల నిర్వాహకులు రేవుల బయట ఉంటూ ఎడ్లబండ్లపై తీసుకొచ్చే ఇసుకను నింపుకొంటున్నారు. ఇసుక అక్రమాలను నిరోధించేందుకు రెవెన్యూ అధికారులు చేసే ప్రయత్నాలను తిప్పికొడుతున్నారు. పురుషోత్తపట్నం నుంచి బొబ్బిల్లంక వరకు 28 కిలోమీటర్ల గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో పగలు, రాత్రుళ్లు ఏదో ఒక చోట ఇలా అక్రమ తవ్వకాలు చేస్తూనే ఉన్నారు. ట్రాక్టర్లపై లోడింగు చేసుకున్న ఇసుకను దూర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయాలు చేసుకుంటే ట్రాక్టరుకు రూ.4,000 పైబడి వస్తోంది. సీతానగరం కైలాస భూమిలో అక్రమ తవ్వకాలు చేస్తుంటే రేవులోకి దిగకుండా బోదె తవ్వేశామని పలుచోట్ల అక్రమంగా ఇసుక తవ్వకాలపై రెవెన్యూ అధికారులను అందుబాటులో పెట్టామని తహసీల్దారు శ్రీనివాసు తెలిపారు.



ఎడ్లబండ్లపై తీసుకొచ్చిన ఇసుకను ట్రాక్టరులో ఎగుమతి ఇలా..

కమిటీల ఏర్పాటుతో న్యాయం జరగదు

గుమ్మళ్లదొడ్డి గ్రామస్థుల నిరసన

గోకవరం, న్యూస్‌టుడే: కమిటీల ఏర్పాటుతో తమకు ఏవిధమైన న్యాయం జరగదని పరిశ్రమను మూసివేయడమే సమస్యకు పరిష్కారమని గుమ్మళ్లదొడ్డి గ్రామస్థులు ఆర్డీవో కృష్ణనాయక్‌కు స్పష్టం చేశారు. అస్సాగో ఇథనల్ పరిశ్రమకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మరోతి శివగణేష్, మరో నాయకుడు పాటంశెట్టి సూర్యచంద్ర చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష గురువారంతో మూడో రోజుకు చేరుకుంది. సూర్యచంద్ర భార్య శ్రీదేవి వీరితో పాటు దీక్షలలో పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని గురువారం సాయంత్రం రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణనాయక్ సందర్శించారు. కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమలశాఖ, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. గుమ్మళ్లదొడ్డి, అచ్యుతాపురం, వెదురుపాక, బావాజీపేట గ్రామాలలో పలువురు ఈ కమిటీలలో చేరాలన్నారు. ఒకవేళ పరిశ్రమ నుంచి దుర్వాసన వస్తే ఈ కమిటీలు ఆయా గ్రామాలలో ఆకస్మిక తనిఖీలు చేస్తాయన్నారు. తద్వారా సమస్యను కలెక్టర్‌కు వివరించి పరిష్కరించవచ్చునని సూచించారు. అయితే కమిటీల ఏర్పాటుతో తమకు ఏవిధమైన న్యాయం జరగదని గ్రామస్థులు తేల్చిచెప్పారు. పరిశ్రమను మూసివేయడమే ఇందుకు శాశ్వత పరిష్కారమన్నారు.



ఆమరణ నిరాహార దీక్ష శిబిరం వద్ద గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణనాయక్

పరిశ్రమ మూతపడే వరకు ఆందోళనలు

కాలుష్యాన్ని వెదజల్లుతున్న అస్సాగో ఇథనల్ పరిశ్రమ మూతపడే వరకు తమ ఆందోళనను కొనసాగిస్తామని గుమ్మళ్లదొడ్డి గ్రామప్రజలు స్పష్టం చేశారు. గురువారం మధ్యాహ్నం పరిశ్రమను ముట్టడించేందుకు ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు బందోబస్తుతో వీరిని ప్రధాన రహదారిపై అడ్డుకున్నారు. దీంతో వీరు రోడ్డుపై బైటాయించి పరిశ్రమకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కలెక్టర్ దృష్టికి ఇప్పటికే మీ సమస్యను తీసుకెళ్లామని రాజమహేంద్రవరం ఆర్డీవో వచ్చి మీ సమస్యపై మాట్లాడతారని అప్పటి వరకు ఆందోళనను విరమించాలని కోరుకొండ సీఐ సత్యకిషోర్ వివరించడంతో వారు ఆందోళనను విరమించారు.

మద్యం దుకాణాల్లో వాటాలివ్వాలని ఆందోళన

సీతానగరం, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల్లో 25 శాతం వాటా జనసేనకు భాగస్వామ్యం కల్పించాలని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. మండలంలోని సీతానగరం, చినకొండేపూడిలో రెండు చోట్ల దుకాణాలు తెదేపా వర్గీయులకు వచ్చాయి. గురువారం రాత్రి కొంతమంది జనసైనికులు మద్యం దుకాణాలకు చేరి తమకు వాటాలు కేటాయించాలని, లేకుంటే మద్యం అమ్మకాలు నిరోధిస్తామని ఆందోళనకు దిగారు. దుకాణం షెట్టర్లు సైతం మూసివేశారు. మద్యం కొనుగోలుకు అప్పటికే బారులు తీరడంతో దుకాణాల నిర్వాహకులు ఎదురు తిరిగారు. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలు అనుసరించి రూ.కోట్ల నిధులతో దుకాణాలు పొందితే ఇలా అడగడం సరికాదంటూ దుకాణం నిర్వాహకుడు, తెదేపా నాయకుడు కాండ్రు శేఖర్ వీరితో వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యే బత్తులతో చర్చిద్దామని అన్నారు. అనంతరం మద్యం అమ్మకాలు యథావిధిగా సాగాయి.

బాణసంచా దుకాణాల ఏర్పాటుకు స్థల పరిశీలన

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: బాణసంచా విక్రయించే దుకాణాల ఏర్పాటుకు గురువారం తహసీల్దారు అనిల్‌కుమార్ పోలీసు, అగ్నిమాపక, పంచాయతీరాజ్ అధికారులతో కలసి అనపర్తిలో స్థల పరిశీలన చేశారు. దీపావళి పండగకు బాణసంచా విక్రయించే దుకాణదారులు కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే లైసెన్సు రద్దు చేస్తామన్నారు. పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆత్మహత్యలు నివారించేందుకు ప్రత్యేక కార్యాచరణ

కడియం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో ఆత్మహత్యలు నివారించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన రాజమహేంద్రవరం దక్షిణమండల డీఎస్పీ భవ్యకిశోర్‌తో కలిసి కడియం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఇప్పటి వరకూ నమోదైన కేసుల వివరాలపై సమీక్షను నిర్వహించి దస్త్రాలను పరిశీలించారు. కడియం పీఎస్ పరిధిలో నేరాల సంఖ్య తక్కువగానే ఉందని, రహదారి ప్రమాదాలతో పాటు ఉపాధి కోసం వలస వచ్చిన కార్మికులు, క్షణికావేశంలో కొందరు మహిళలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆయన వివరించారు. వీటి నివారణకు సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. రహదారుల ప్రమాదాలు నివారించడానికి కృషి చేస్తున్నామన్నారు. కడియం సీఐ అల్లు వెంకటేశ్వరరావు, ఎస్‌బీ సీఐ ఎ.శ్రీనివాసరావు, ఎస్.ఐలు నాగదుర్గాప్రసాద్, ధనలక్ష్మిప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్

రైతుల సమస్యలను సహనంతో వినాలి: ఎమ్మెల్యే

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దే కార్యక్రమం కూటమి ప్రభుత్వం చేపట్టిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతుల సమస్యలపై ఆరాతీశారు. వారితో సామరస్యంగా మెలగాలని, రైతులు చెప్పే సమస్యలను సహనంతో విని వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి శేషారత్నం, సత్తి దేవనందరెడ్డి, రామకృష్ణారెడ్డి, సుభాషిని, తహసీల్దారు అనిల్ కుమార్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మహేంద్రవాడ గ్రామసభలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

కెనాల్‌రోడ్డు అభివృద్ధి చేస్తాం..

అనపర్తి గ్రామీణం: రాజమహేంద్రవరం- కాకినాడ కెనాల్ రోడ్డు రహదారి అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే నల్లమిల్లి అన్నారు. అనపర్తి గ్రామపంచాయతీ కార్యాలయంలో ర.భ.శా, ఎన్‌హెచ్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. రహదారుల అభివృద్ధి, తదితర అంశాలపై చర్చించారు. జిల్లా ప్రధాన సమస్యల్లో కాకినాడ-రాజమహేంద్రవరం కెనాల్‌రోడ్డు ఒకటని వైకాపా పాలనలో రహదారికి మరమ్మతులు కూడా చేపట్టలేదన్నారు. రూ.560 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు తయారు చేయడం, అనపర్తి, వేమగిరి బైపాస్ రోడ్డు నిర్మాణం చేయాలనే ఆలోచనతో రూ.960 కోట్లు అంచనా వ్యయంతో ప్రతిపాదనలు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం కెనాల్ రోడ్డు అభివృద్ధి చేస్తుందని హామీ ఇచ్చారు. ర.భ.శా, ఎన్‌హెచ్ అధికారులు పాల్గొన్నారు.

బీఎస్ఎల్ శిక్షణ ప్రతి ఒక్కరికీ అవసరం

హుకుంపేట, న్యూస్‌టుడే: బీఎస్ఎల్ (బేసిక్ లైఫ్ సపోర్ట్)లో తర్ఫీదు శిక్షణ ప్రతి ఒక్కరికీ అవసరమని డాక్టర్ తాటికొండ చంద్రమౌళి అన్నారు. గురువారం స్థానిక గోదావరి రుచులు ఫంక్షన్ హాల్‌లో అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ ఖాన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గుండెపోటు ఇబ్బందులు కలిగినప్పుడు వారి ప్రాణాలను కాపాడటంలో బీఎస్ఎల్ ప్రధానమైనదని అన్నారు. జాతీయ అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు, వీబీటీ రాజు, కె.జనార్దన్, బళ్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వాల నమోదు

రంగంపేట: మండలంలోని భాజపా సభ్యత్వాల నమోదు విజయవంతంగా పూర్తయ్యిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎం.సాయిరామ్ తెలిపారు. గురువారం రంగంపేటలో సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిల సూచనలతో 7 వేల సభ్యత్వాలు, 50 క్రియాశీల సభ్యత్వాలను నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. సీనియర్ నాయకులు వి.వి.వి.మాణిక్యం, మండవిల్లి గుప్తా, పెండ్యాల బుజ్జిబాబు, చినబాబు, రామచంద్రరావు, సాయి తాతారావు, సూర్య భాస్కరరావు పాల్గొన్నారు.

మెళ్లూరులో 53 దరఖాస్తులు

బిక్కవోలు: మెళ్లూరులో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 53 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దారు కృష్ణ తెలిపారు. రెవెన్యూ అధికారులు నిర్వహించిన సర్వేలో తమ భూములు తక్కువగా ఉన్నాయని, పోయిన భూమి ఎక్కడ ఉందో చూపాలని కొందరు, కొలతలు సక్రమంగా లేవని, మరి కొందరు ఫిర్యాదులు చేశారని ఆయన అన్నారు.

అక్రమంగా చెట్ల నరికివేత

గోకవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వం మొక్కల పెంపకానికి చర్యలు చేపడుతుంటే మరో పక్క గ్రామాలలో పచ్చని చెట్లను యథేచ్ఛగా నరికేస్తున్నారు. చెరువుగట్టుపై ఉన్న చెట్లను పలువురు వ్యక్తులు అక్రమంగా తొలగించారు. కృష్ణునిపాలెంలోని రాజు చెరువు గట్టుపై పలు జాతులకు చెందిన వృక్షాలు ఉన్నాయి. అయితే వీటిలో 20 చెట్లను పలువురు వ్యక్తులు గురువారం గుట్టుచప్పుడు కాకుండా నరికివేశారు. నరికిన చెట్లలో నెమలి, తురాయి, గానుగ తదితర జాతులకు చెందినవి ఉన్నాయి. వాటిని ముక్కలుగా నరికి తరలించి విక్రయించేందుకు సిద్ధం చేశారు. ఇది తెలిసి గ్రామానికి చెందిన పలువురు వాటిని అడ్డుకొని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇరిగేషన్ ఏఈ నాగలక్ష్మితో పాటు పలువురు అధికారులు వెళ్లి చెట్ల మోడులను పరిశీలించారు. దీనిపై విచారణ నిర్వహించి తగిన చర్యలు చేపడతామని ఆమె తెలిపారు.



తరలింపునకు సిద్ధంగా ఉన్న చెట్ల ముక్కలు

మహిళా రక్షక్‌తో ప్రయోజనాలు

కడియం: కడియం ఎస్.ఐ పి.ధనలక్ష్మి ప్రసన్న ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఆమె గురువారం విలేకర్లతో మాట్లాడుతూ కృష్ణా జిల్లా నుంచి సాధారణ బదిలీల్లో కడియం వచ్చినట్లు తెలిపారు. జిల్లాలో ప్రారంభించిన మహిళా రక్షక్ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

యోగాతో ఆరోగ్యం

బొమ్మూరు: యోగాసనాలు రోజూ వేయడం నియమంగా అలవాటు చేసుకోవాలని బొమ్మూరు జిల్లా మహిళా ప్రాంగణం ఇన్‌ఛార్జి మేనేజర్ నర్సమ్మ తెలిపారు. ప్రాంగణంలో శిక్షణ పొందుతున్న టైలరింగ్, బ్యూటీషియన్ విద్యార్థులకు యోగాపై గురువారం అవగాహన కల్పించారు. శిక్షకురాలు డా.దివ్య ప్రాంగణ సిబ్బంది శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

60 లీటర్ల సారా స్వాధీనం

రాజమహేంద్రవరం నేరవార్తలు: నామవరం గ్రామ శివారులో బొమ్మూరు పోలీసులు నిర్వహించిన దాడుల్లో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం నేడు

చాగల్లు, న్యూస్‌టుడే: అనంత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అనంత్ హెల్త్ క్లినిక్‌లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. థైరాయిడ్, షుగర్, గుండె దడ, ఆయాసం తదితర ఆరోగ్య సమస్యలకు చికిత్స అందిస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్విని యోగం చేసుకోవాలన్నారు.

బకాయిలు చెల్లించాలి

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు పురపాలక సంఘం పరిధిలో ఇంటి, కొళాయి పన్నుల బకాయిలను తక్షణమే చెల్లించాలని పురపాలక సంఘం కమిషనర్ కృష్ణవేణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. లేనిపక్షంలో కొళాయి కనెక్షన్లు తొలగిస్తామన్నారు. పన్నులను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలన్నారు.

కొవ్వూరు

•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

ఆలయ అభివృద్ధికి ఆర్థిక సాయం



నగదును అందిస్తున్న గ్రామ పెద్దలు

నల్లజర్ల: నల్లజర్ల గ్రామ దేవత సోమాలమ్మతల్లి ఆలయాభివృద్ధికి గురువారం పలువురు ఆర్థిక సాయం అందజేశారు. నల్లజర్ల గ్రామానికి చెందిన తేజ ఆగ్రో ఏజెన్సీస్ అధినేత శీలంశెట్టి ప్రసన్నకుమార్, శ్యామల దంపతులు రూ.1,01,116, అమ్మవారి ఆలయంలో అయ్యప్పస్వామి మాలధారులు రూ.25 వేలు నగదును ఆలయ కమిటీ సభ్యుడు బొమ్మిరెడ్డి గాంధీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు గురుస్వామి శ్రీరామకృష్ణ గ్రామ పెద్దలు బలుసు శ్రీనివాసరావు, గన్నిన శ్రీనివాసరావు, నవలం రామకృష్ణ, గన్నిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల్లో శ్రీ చైతన్య విద్యార్థులు

ప్రతిభకు పదును..!



కొవ్వూరులో విజేతలతో ప్రిన్సిపల్ మధుబాబు, తదితరులు

చాగల్లు, న్యూస్‌టుడే: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు అన్ని రంగాలపై పట్టు సాధించాలని ప్రిన్సిపల్ ఎన్.ఎస్.వి.డి. మధుబాబు తెలిపారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో కొవ్వూరులోని శ్రీ చైతన్య ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో గురువారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగంపై లాభాలు, నష్టాలు' 'విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన 9వ తరగతి చదువుతున్న ఎం.వెన్నెల సమీర, ద్వితీయ స్థానంలో 9వ తరగతి విద్యార్థిని జి.తనుశ్రీ, తృతీయ స్థానంలో 8 తరగతి చదువుతున్న జి.లోకేష్ నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ మధుబాబు, డీన్ ఎస్.కృష్ణ బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బడికెళ్లాలంటే.. మురుగు దాటాలంతే..!

గోపాలపురంలోని పంచాయతీ కార్యాలయం వెనుక వీధిలో రహదారిపై మురుగు ప్రవహిస్తుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆ వీధి నుంచి ఉప్పరగూడెం, కోమటికుంట, వాదాలకుంట, గౌడ్ కాలనీలకు చెందిన విద్యార్థులు ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సి ఉంటుంది. గత కొద్ది రోజుల నుంచి ఈ సమస్య మరింత తీవ్రంగా మారడంతో ఈ దారిగుండా రాకపోకలు సాగించేవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యాలయం సమీపంలోనే ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి అనురాధ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే మరమ్మతులు చేయిస్తామన్నారు. - న్యూస్‌టుడే, గోపాలపురం

సాగునీటి సంఘాల ఎన్నికల సందడి

గ్రామాల్లో పెరుగుతున్న ఆశావహులు

గోపాలపురం, న్యూస్‌టుడే: సాగు నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన విడుదల చేయడంతో పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంది. ఆయా మండల పరిధిలో ఉన్న సాగు నీటి చెరువుల అధ్యక్ష పదవి కోసం ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గత సోమవారం సాగునీటి ఎన్నికలకు నోటిఫికేషన్ రావడంతో ఇరిగేషన్ అధికారులు ఓటర్ల జాబితా తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి 40 రోజుల లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రైతు ప్రతినిధులు సభ్యులుగా ఉండే సాగు నీటి వినియోగదారుల సంఘాలు 2003లో ఆవిర్భవించాయి. 2015లో ఈ సంఘాలకు ఎన్నికలు జరగ్గా 2020 వరకు ఆ సంఘాలు మనుగడలో ఉన్నాయి. అనంతరం అధికారంలో ఉన్న వైకాపా ప్రభుత్వం నీటి సంఘాల వ్యవస్థను నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మరోసారి సాగు నీటి సంఘాలకు జీవం పోసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో రైతు ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం ఏళ్లగా పనిచేసిన రైతు నాయకులు ఈ పదవుల కోసం ఎదురు చూస్తున్నారు.

డివిజన్ పరిధిలో ఇలా..

కొవ్వూరు డివిజన్ పరిధిలోని గోపాలపురం, కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల పరిధిలో అత్యధికంగా 53 మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. వాటిలో 29 వాటికి ఎన్నికలు జరగనున్నాయి. కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల పరిధిలో సాగు నీటి కాలువలు, ఎత్తిపోతల పథకాలు కూడా ఉన్నాయి. వాటితో పాటు గోదావరి డెల్టా, ఇతర కాలువలకు సంబంధించి ఎన్నికలు జరగనున్నాయి. అత్యధికంగా గోపాలపురం మండలంలో 11 మైనర్ చెరువులు, దేవరపల్లిలో 5, నల్లజర్లలో 7, నిడదవోలు మండలంలో 6 చెరువులున్నాయి.



సాగు నీటి కాలువ

సిద్ధం చేస్తున్నాం...

ఇప్పటికే సాగు నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడింది. ప్రస్తుతం రైతు ప్రతినిధుల వివరాలు సేకరించి ఓటరు జాబితా సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియ సక్రమంగా సాగే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. - రాహుల్ భాస్కర్, ఇరిగేషన్ ఏఈ

మహిళలే పారిశ్రామికవేత్తలు

తాళ్లపూడి, న్యూస్‌టుడే: స్వయం సహాయ సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదగడానికి బ్యాంకుల ద్వారా కేంద్ర ప్రభుత్వం పలు పథకాల కింద రాయితీతో కూడిన రుణాలు మంజూరు చేస్తోందని జిల్లా లఘు పరిశ్రమల అభివృద్ధి ప్రోగ్రాం అధికారి శ్రీనివాసు తెలిపారు. తాళ్లపూడిలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం మంగాయమ్మ ఆధ్వర్యంలో మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వీవోఏ, సీసీలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. పీఎం ఈజీపీ, పీఎం ఎఫ్‌ఎంఈ పథకాలను అమలు చేస్తోందన్నారు. లబ్ధిదారులు, యూనిట్లను ఎంపిక చేయాలన్నారు. గ్రామస్థాయిలో మహిళలకు అగాహన కల్పించి, వారి కుటుంబ జీవన విధానాన్ని అభివృద్ధి చేయాలన్నారు. తద్వారా మరి కొంత మందికి ఉపాధిని దొరుకుతుందన్నారు. తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

రూ.25 కోట్లతో అభివృద్ధి పనులు



దేవరపల్లిలో అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

దేవరపల్లి, న్యూస్‌టుడే: పంచాయతీ వ్యవస్థకు అభివృద్ధి బాటలు వేస్తున్నామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. దేవరపల్లి మండలంలో ఆయా గ్రామాల్లో మురుగు కాలువలు, రహదారుల నిర్మాణాలు, పలు అభివృద్ధి పనులకు గురువారం కూటమి నాయకులతో భూమి పూజ చేశారు. ముందుగా దేవరపల్లిలోని శ్రీ బాలదుర్గమ్మ ఆలయంలో తెదేపా నాయకులు రామారావు, వాసు, శ్రీధర్, నవీన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు పటిక బెల్లంతో తులాభారం వేసి మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం మండలం కేంద్రమైన దేవరపల్లిలోని చంద్రబాబు నాయుడు కాలనీలో రూ.10 లక్షలతో, వేంకటేశ్వరనగర్‌లో రూ.25 లక్షలతో సీసీ రోడ్లు, ప్రధాన రహదారి నుంచి మారుతీనగర్ వరకు రూ.1.9 కోట్లతో మురుగుకాలువ నిర్మాణాలకు భూమి పూజ చేశారు. రామన్నపాలెం, ధుమంతునిగూడెం, త్యాజంపూడి, లక్ష్మీపురం, గౌరీపట్నం గ్రామాల్లో పలు నిర్మాణాలకు భూమిపూజ చేశారు. రూ.3.5 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని 85 పంచాయతీల్లో రూ.25 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. డిసెంబరు ఆఖరికి పనులు పూర్తి చేస్తామన్నారు. విజయవాడ వరదబాధితుల కోసం సత్యసాయి ప్రైవేటు పాఠశాల విద్యార్థులు సేకరించిన రూ.8,000 నగదును ఆయనకు అందజేశారు. నాయకులు ఆండ్రు అనిల్, సువర్ణరాజు, గన్నమని హరికృష్ణ, కొయ్యలమూడి చిన్నబాబు, సుధారాణి, కొఠారి ధృవకాంత్, ఉప్పులూరి రామారావు, అక్కిన సుబ్బారావు, సుబ్రహ్మణ్యం, అమరావతి, అధికారులు పాల్గొన్నారు.

సేవకుడిగా పనిచేస్తా: మంత్రి



ఎల్‌వోసీ పత్రం అందిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, పెరవలి, న్యూస్‌టుడే: నిడదవోలు నియోజకవర్గ ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సేవకుడిగా పనిచేస్తానని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న నలుగురికి చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.13.58 లక్షల విలువైన ఎల్‌వోసీ పత్రాలను గురువారం లబ్ధిదారులకు నిడదవోలులో క్యాంపు కార్యాలయంలో అందించారు. పెండ్యాలకు చెందిన విప్పర్తి శ్రీనుకు రూ.1,08,600, తాడిమళ్లకు చెందిన సింగులూరి విజయలక్ష్మికి రూ.5 లక్షలు, పెరవలి మండలం ఖండవల్లికి చెందిన గంటా నాగవెంకట సుబ్రహ్మణ్యంకు రూ.1.50 లక్షలు, కానూరుకు చెందిన వీరమల్లు రాంబాబుకు రూ.6 లక్షల విలువైన ఎల్‌వోసీ పత్రాలను అందించారు

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

నల్లజర్ల: ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు. గురువారం నల్లజర్లలోని తెదేపా కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 18 మంది లబ్ధిదారులకు రూ.32,83,341 విలువైన ముఖ్యమంత్రి ఆర్థిక సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే అందచేశారు. పేద ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని అన్నారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

నిడదవోలు, పెరవలి, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెదేపా నిడదవోలు మండల అధ్యక్షుడు వెలగన సూర్యారావు అన్నారు. నిడదవోలు తెదేపా కార్యాలయంలో సూర్యారావు అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈనెల 26 నుంచి ప్రారంభం ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో తెదేపా పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, పంచదార దుర్గాప్రసాద్, కొరశిఖ చంద్రమౌళి, గోగిన శ్రీనివాసరావు, ఈదూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ● తెదేపా సభ్యత్వ నమోదు వేగంగా చేయాలని మండలశాఖ అధ్యక్షుడు అతికాల వెంకట రామకృష్ణమ్మ పేర్కొన్నారు. పెరవలిలో నిర్వహించిన మండలస్థాయి తెదేపా సమావేశంలో ఆయన మాట్లాడారు. సభ్యత్వ నమోదు చేయించుకున్న వారికి ప్రమాద బీమా రూ.5 లక్షలు కల్పించారన్నారు. నాయకులు వాకలపూడి వీర్రాజు, సలాది కృష్ణమూర్తి, అబ్బిశెట్టి సత్తిరాజు, బొడ్డు రామాంజనేయులు, మానికిరెడ్డి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీలో అక్క, తమ్ముడి ప్రతిభ



కైవల్య తీసిన సుచిన్ షాన్ అట్లాస్ ఫొటో

నిడదవోలు, న్యూస్‌టుడే: ఉత్తరప్రదేశ్‌కు చెందిన మదర్ ఈదర్నా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 24 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో నిడదవోలుకు చెందిన అక్కా, తమ్ముడు ప్రతిభ ప్రదర్శించారు. కె.కైవల్యరెడ్డి తీసిన తోకచుక్క సి/2023ఎ3 సుచిన్ షాన్ అట్లాస్ ఫొటో ఈ పోటీల్లో తృతీయ స్థానం దక్కించుకుంది. ఎనభై వేల సంవత్సరాల తర్వాత మళ్లీ మాత్రమే మళ్లీ ఈ తోకచుక్క కనిపించే అవకాశం ఉందని ఆమె తెలిపారు. సోదరుడు తపస్వి మాధవరంలోని కాలువలో తీసిన జంట కలువల ఫొటో ఎంపికై అయిదో స్థానం సాధించాడు. వీరిద్దరిని పలువురు గురువారం అభినందించారు.



తపస్వి తీసిన జంట కలువల చిత్రం

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో వ్యాయామోపాధ్యాయులు

తాళ్లపూడి, న్యూస్‌టుడే: వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని ఎంఈవో బాలామణి తెలిపారు. కబడ్డీ అండర్-17 విభాగంలో మురకొండ వీరపండు(పదో తరగతి), అండర్-14 విభాగంలో యర్రంశెట్టి నాగభరత్(8వ తరగతి) ఏలూరు జిల్లాలో ఈనెల 23న జరిగిన జిల్లాస్థాయి పోటీలల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. త్వరలో జరిగే అన్నమయ్య జిల్లాలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

ఆలయంలో చోరీకి విఫలయత్నం

తాళ్లపూడి, న్యూస్‌టుడే : తాళ్లపూడి సాయినాథుని ఆలయ ప్రాంగణంలోని బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగుడు ప్రవేశించి చోరీకి విఫలయత్నం చేశాడు. ఆలయ కమిటీ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఎవరూ గుర్తుపట్టకుండా దుండగుడు ముఖంపై చేతిరుమాలు కట్టుకుని ఆలయ కిటికీని గునపంతో తొలగించి లోపలికి ప్రవేశించాడు. ఆలయంలో ఉన్న పెద్ద హుండీని గునపంతో తొలగించే ప్రయత్నం చేశాడు. ఎంతకీ అది తెరుచుకోకపోవడంతో సమయం మించిపోతుందని పక్కనే ఉన్న చిన్న హుండీలో నగదు అపహరించుకుపోయాడు. తెల్లాసరికి చోరీ యత్నం బయటపడింది. కమిటీ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రామకృష్ణ సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. సీసీ ఫుటేజీ, వేలిముద్రల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

వివాహితపై కత్తితో దాడి : కేసు నమోదు

తాళ్లపూడి, న్యూస్‌టుడే : వివాహితపై దాడికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు జిల్లా దెందులూరుకు చెందిన ఆరేపల్లి హరినాథ్ గురువారం ఉదయం తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్టకు చెందిన ఓ వివాహిత ఇంటికి వచ్చాడు. భర్త, బావ సమక్షంలోనే వివాహితను బలవంతంగా గదిలోకి తీసుకెళ్లి తలుపు గడియ పెట్టేందుకు ప్రయత్నించగా ఆమె బావ అడ్డగించారు. దీంతో హరినాథ్ వెంట తెచ్చుకున్న చాకుతో ఆమె గొంతు కోయడానికి ప్రయత్నించగా బావ అడ్డుపడడంతో ఆయన బొటన వేలుకు గాయమైంది. అయినా హరినాథ్ ఆగకుండా నిన్ను చంపేస్తానంటూ చాకుతో వివాహిత పొట్టలో పొడిచాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో పరిసరాల్లోని వారు అక్కడికి చేరుకోవడంతో హరనాథ్ అక్కడ నుంచి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు



చాగల్లు, న్యూస్‌టుడే: వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొవ్వూరు పట్టణం, చాగల్లు మండలంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ అప్పారావు తెలిపారు. కొవ్వూరు పట్టణంలో జూనియర్ కళాశాల, మూడు డాబాల వీధి, చాగల్లు, మీనా నగరం, నెలటూరు గ్రామాల్లోని గృహ, వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

నల్లజర్ల, ఉండ్రాజవరం, దేవరపల్లి: పోతినీడుపాలెం విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల మరమ్మతుల కారణంగా పోతినీడుపాలెం, చాదరాశిగుంట గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ తెలిపారు. ● పాలంగి విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో మరమ్మతు పనుల నిమిత్తం చివటంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నారు. ● దేవరపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ పట్టణ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నారు. యర్నగూడెం సబ్ స్టేషన్ పరిధిలోని కృష్ణపాలెంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదు.

నిడదవోలు: నిడదవోలు పట్టణ 11కేవీ మూడో విద్యుత్తు ఫీడర్ మరమ్మతుల నిమిత్తం పట్టణంలోని బాలాజీనగర్, విద్యానగర్, శశి పాఠశాల రోడ్డు, టక్కరిబాబాపేట, సంజీవయ్యనగర్, ఎస్టీకాలనీ ప్రాంతాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదు. బసివిరెడ్డిపేట విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ నిర్వహణ పనుల నిమిత్తం సమిశ్రగూడెం, అట్లపాడు గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదు.

పెరవలి: పెరవలి, కానూరు విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలోని గ్రామాలకు ఉదయం 7 నుంచి మధ్యహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఈఈ తెలిపారు.

అ వీ ఇ వీ అ న్నీ

ధాన్యం సకాలంలో తరలించాలి

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: ధాన్యం సేకరణ విషయంలో రైస్‌మిల్లర్లకు, రైతులకు సిబ్బంది చేయూతనిచ్చి ఉత్తమ సేవలు అందించాలని తహసీల్దార్ పి.ప్రసాదు అన్నారు. ఉండ్రాజవరంలో ధాన్యం కొనుగోలుపై మండల స్థాయిలో అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. సంచులు, తేమశాతం, రవాణా, బరకాలు, అవసరం మేరకు జట్టు కూలీలను పెంచటం తదితర పనుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంపీడీవో వి.రామారావు, మండల వ్యవసాయాధికారి ఎం.విశ్వాసరావు, డీటీ సుధీర్‌రెడ్డి, రైస్‌మిల్లర్లు, వీఆర్వోలు, సొసైటీల కార్యదర్శులు పాల్గొన్నారు.

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

నిడదవోలు: కార్తికమాసాన్ని పురస్కరించుకుని నవంబరు 2 నుంచి పంచారామ శైవ క్షేత్రాలకు, శబరిమలై వెళ్లే భక్తులకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు నిడదవోలు ఆర్టీసీ డిపో మేనేజర్ కె.వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ప్రతి శని వారం, ఆదివారాల్లో ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. సోమవారం ఏకాదశి రుద్రులు, అష్ట సోమేశ్వరాలయాలకు కూడా ప్రత్యేక బస్సులు తిప్పుతామన్నారు. పంచారామ క్షేత్రాలకు పల్లె వెలుగు టిక్కెట్ రూ.700, ఏకాదశ రుద్రులు, అష్ట సోమేశ్వరాలయాలకు రూ.350, అయ్యప్ప భక్తులకు ఐదు రోజుల ప్యాకేజీకి గాను రూ.4,600, ఏడు రోజుల ప్యాకేజీకి రూ.5,600, పది రోజుల ప్యాకేజీకి రూ.7,500 ధరగా నిర్ణయించామన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

తాళ్లపూడి : సమాచార హక్కు చట్టంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఏవో రుచిత తెలిపారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో సమాచార హక్కు చట్టం-2005పై మండలస్థాయి అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రతి పౌరుడు ఈ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ రవీంద్రనాథ్ తెలిపారు. ఎంఈవో నెహ్రూ, ఎంపీడీవో కార్యాలయ ఏవో నిర్మల పాల్గొన్నారు.

వైకాపా పట్టణ అధ్యక్షుడి రాజీనామా

నిడదవోలు: వైకాపా నిడదవోలు పట్టణ అధ్యక్షుడు ముంగండి కృపానందం పట్టణ అధ్యక్ష పదవికి, వైకాపాకు గురువారం రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు పంపించారు. మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు వ్యవహారశైలి నచ్చక రాజీనామా చేస్తున్నానన్నారు.

దుకాణాల ఏర్పాటుకు అనుమతులు

గోపాలపురం: దీపావళికి దుకాణాలు ఏర్పాటు చేసే వారు తప్పకుండా అనుమతి పొందాలని తహసీల్దార్ విద్యాపతి పేర్కొన్నారు. మండలంలోని దొండపూడిలో దీపావళి సరకులు అమ్మడానికి ఏర్పాటు చేసే దుకాణాల స్థలాన్ని తహసీల్దార్ గురువారం రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. దుకాణదారులు ప్రభుత్వ నియమనిబంధనలు పాటించాలన్నారు. అనుమతి లేకుండా ఎవరైనా మందుగుండి సామగ్రి నిల్వ ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

26న సామాజిక తనిఖీ ప్రజావేదిక

గోపాలపురం: మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2023-24 సంవత్సరంలో చేపట్టిన పనులకు సంబంధించి ఈ నెల 26న సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీవో రమణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో చేసిన పనులపై ఆరా తీయడం జరుగుతుందన్నారు. శనివారం మండల పరిషత్తు కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహిస్తామన్నారు.

నిర్లక్ష్యంగా వాహనాల నిలుపుదల



ఫ్లైఓవర్ కింద ఆగిన లారీలు

నల్లజర్ల, న్యూస్‌టుడే: నల్లజర్ల శివారులోని పోతవరానికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న జాతీయ రహదారి ఫ్లైఓవర్ కింద అటుగా వెళ్లే వాహనాలతోపాటు పలు లారీలను నిలుపుదల చేస్తున్నారు. దీంతో ఆయా సమయాల్లో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నెలలో రెండు, మూడు ప్రమాదాలు జరిగి వాహనచోదకులు క్షతగాత్రులవుతున్నారు. వంతెన కింద వాహనాలు నిలుపుదల చేయడం, ఆ ఫ్లైఓవర్‌కు చేర్చి వివిధ కంపెనీల యాడ్‌లతో పాటు సినిమా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల తరచూ ఈ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అచ్చన్నపాలెం ఫ్లైఓవర్ శివారులో ఉండడం వల్ల ఆ గ్రామస్థులు నల్లజర్లకు రావడానికి దూరం అనే భావనతో అపసవ్య దిశలో ఫ్లైఓవర్ వద్దకు వచ్చే క్రమంలో వాహనాలు ఢీకొని మరిన్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల చీపురుగూడెంకు చెందిన ఒకరు కారులో నల్లజర్ల ఫ్లైఓవర్ దాటే సమయంలో ఓ సినిమాకు సంబంధించిన ఫ్లెక్సీ అడ్డుగా ఉండడం వల్ల ద్విచక్రవాహనదారుడు ఢీకొన్నాడు. దీంతో ద్విచక్రవాహనదారుడికి గాయాలయ్యాయి. గతంలో కొయ్యలగూడెం నుంచి వచ్చే ఒక ఉపాధ్యాయురాలు కారులో నల్లజర్ల ఫ్లైఓవర్ దాటే సమయంలో ద్విచక్రవాహనదారుడు అకస్మాత్తుగా వచ్చాడు. దీంతో కారు బ్రేక్ వేయడంతో అది పల్టీ కొట్టింది. ఆమె గాయాలతో బయటపడింది. ఇటువంటి సంఘటనలు అనేకం చోటుచేసుకుంటున్నాయి. అధికారులు ఈ సమస్యపై దృష్టి పెట్టాలని పరిసర గ్రామస్థులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

ఫ్లైఓవర్ కింద వాహనాలు నిలుపుదలకు ఎలాంటి అనుమతులు లేవు. నల్లజర్ల నుంచి వాహనచోదకులు ఫ్లైఓవర్ దాటే క్రమంలో సర్వీసు రోడ్డు నుంచి అవగాహన లేకుండా వేగంగా వచ్చి ప్రమాదాలబారిన పడుతున్నారు. పర్యవేక్షణ పెంచి వాహనాల నిలుపుదల లేకుండా, రోడ్డును అడ్డుగా దాటకుండా, అడ్డుగా ఉన్న ఫ్లెక్సీల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. - శ్రీనివాసరావు, సీఐ, నల్లజర్ల

ఆదర్శనీయులు.. పోలీసు అమర వీరులు



చాగల్లు: రక్తదానం చేస్తున్న పోలీసులు

చాగల్లు, న్యూస్‌టుడే: ప్రజల రక్షణకు తమ ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరులు యువతకు ఆదర్శనీయులని కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ పేర్కొన్నారు. సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సీఐలు పి.విశ్వం, కె.విజయ్‌బాబు, ఎస్సైలు కె.జగన్, కె.శ్రీహరి, సిబ్బంది, జనసేన పట్టణాధ్యక్షుడు డేగల రాము, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: పోలీస్ అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా ఉండ్రాజవరం పోలీస్‌స్టేషన్‌లో వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. పోలీసులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు విచ్చేసి శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఎస్సై గుబ్బల శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవం



పౌష్టికాహారంతో లయన్స్‌క్లబ్ సభ్యులు

చాగల్లు: ప్రపంచ శాంతి పరిరక్షణలో ఐక్యరాజ్య సమితి కృషి ప్రశంసనీయమని లయన్స్ క్లబ్ కొవ్వూరు అధ్యక్షుడు ఎం.వి.వి. సత్యనారాయణ పేర్కొన్నారు. క్రిస్టియన్‌పేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐక్యరాజ్య సమితి దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించారు. క్లబ్ సభ్యులు జయరాజు, హుస్సేన్ పాల్గొన్నారు.